ప్రజాశక్తి

శుక్రవారం 14 జులై 2023 8 పేజీలు



గుంటూరు



పల్నాడు

కల్తీ విత్తనాలపై కఠిన చర్యలు

- డిఆర్‌సి సమావేశంలో అధికారులకు మంత్రి ధర్మాన ఆదేశం
- పలు సమస్యలను ప్రస్తావించిన ప్రజాప్రతినిధులు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

కల్తీ విత్తనాలు విక్రయించే వ్యాపారులపై కఠినమైన చర్యలను తీసుకొని ఉక్కుపాదంతో అణిచివేయాలని అధికారులను రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ధర్మాన ప్రసాదరావు ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని ఎస్.ఆర్.శంకరన్ హాలులో జిల్లా సమీక్షా కమిటీ సమావేశానికి మంత్రి అధ్యక్షత వహించారు. తొలుత వ్యవసాయంపై జరిగిన చర్చలో శాసన మండలి చీఫ్‌విప్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు, ఎమ్మెల్యే ఆళ్లరామకృష్ణారెడ్డి మాట్లాడుతూ నకిలీ విత్తనాల వల్ల పంటలు నష్టపోతే అందించే పరిహారంపై పంటల వారీగా వ్యవసాయ శాఖ అధికారులు నివేదిక అందించాలన్నారు. కల్తీ విత్తనాల విక్రయాలు జరుగకుండా విస్తృత తనిఖీలు నిర్వహించాలన్నారు. కల్తీ విత్తనాలు విక్రయించే వ్యాపారులపై క్రిమినల్ కేసులతో పాటు, విత్తన చట్టం కింద కేసులు నమోదు చేసి నష్టపోయిన రైతులకు పరిహారం అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కల్తీ విత్తనాలు, ఎరువులపై వ్యవసాయశాఖ అధికారి వెంకటేశ్వర్లు ఇచ్చిన వివరణకు సంతృప్తి చెందని మంత్రి జిల్లాలో ఎక్కడా నకిలీ విత్తనాలు, నకిలీ ఎరువులు కనిపించినా సహించబోనని హెచ్చరించారు. వ్యవసాయ శాఖ యంత్రాంగం మొత్తం ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని, విజిలెన్సు సహకారం తీసుకుని తనిఖీలు పెంచాలని, దుకాణాలు, వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఈ అంశంపై సిఎం జగన్ సీరియస్‌గా ఉన్నారన్నారు.

మొబైల్ డయ్యర్లు ఇవ్వాలి : ఏసురత్నం

ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం మాట్లాడుతూ మిర్చి, కాటన్ రైతుల కోసం ఆర్‌బికేల్లో మొబైల్ డయర్లను ఉద్యాన శాఖ ద్వారా ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. గుంటూరు నగరంలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా పూర్తిస్థాయిలో తాగునీటి సరఫరా కోసం కృష్ణా నది నుంచి ప్రత్యేకంగా నల్లపాడులో వున్న చెరువుకు పైపులైన్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. నల్లపాడులో 110 ఎకరాల చెరువు అందుబాటులో ఉందన్నారు.

గుంటూరు ఛానల్ కట్టలు తెగిపోతాయి : హనుమంతరావు

ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు మాట్లాడుతూ గుంటూరు ఛానల్‌లో తూటికాడ

2లో



డిఆర్‌సి సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ధర్మాన ప్రసాదరావు

కౌల్దార్లకు రుణాలివ్వడం లేదు

ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు



ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ కౌలు రైతులందరికీ సిసిఆర్‌సి కార్డులు మంజూరు చేసి బ్యాంక్‌ల ద్వారా రుణాలు మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. గతేడాది రూ.50 కోట్లు ఇచ్చారని తెలిపారు. ఎస్‌బిఐ రైతులకు రుణాలు ఇవ్వడంలేదన్నారు. 19 వేలమంది సిసిఆర్‌సిలు ఇచ్చినా రుణాలు కేవలం రూ.5 కోట్లు ఇచ్చారని అన్నారు. గుంటూరు ఛానల్ విస్తరణ, పొడిగింపు పనులు వేగవంతం చేయాలని కోరారు. జెడ్‌పి పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా నాన్ టీచింగ్ సిబ్బందిని నియమించాలని, ఇంటర్మీడియట్ ప్రవేశపెట్టిన ఉన్నత పాఠశాలలో ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని, జగనన్న విద్యా కానుక కిట్లు అందించాలని కోరారు. మంగళగిరిలోని ఎయిమ్స్‌కు తాగునీటి సరఫరా కోసం మంజూరు చేసిన పైపు లైన్ల పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు. గుంటూరు నగరంలో గోరంట్లలో నిర్మిస్తున్న తాగునీటి ప్రాజెక్టు పనులను వెంటనే పూర్తి చేయాలని, నగరంలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు రైల్వే లెవెల్ క్రాసింగ్ వద్ద ఆర్‌యుబిల నిర్మాణాలు చేపట్టాలని కోరారు. బిసి స్టడీ

2లో

గుంటూరు ఛానల్ విస్తరణకు ప్రాధాన్యం : మంత్రి ధర్మాన

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

గుంటూరు ఛానల్ విస్తరణ కోసం భూ సేకరణ ప్రక్రియ కొనసాగుతోందని, పనులను త్వరలోనే ప్రారంభిస్తామని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ధర్మాన ప్రసాదరావు తెలిపారు. సమావేశం ముగిసిన తరువాత మంత్రి ధర్మాన మీడియాతో మాట్లాడుతూ ఈ ఛానల్ విస్తరణకు సిఎం జగన్ సానుకూలంగా ఉన్నారని, భూసేకరణకు త్వరలో నిధులు వస్తాయని అన్నారు. గ్రామ స్థాయిలోనే వైద్య పరీక్షలు నిర్వహించేందుకు ఫ్యామిలి డాక్టర్ కాన్సెప్ట్ పూర్తి స్థాయిలో సత్ఫలితాలను ఇస్తోందని, వైద్యులే గ్రామాలకు వెళ్లి పరీక్షలు నిర్వహించి వ్యాధి నిర్ధారణ చేసి మందులను ఉచితంగా అందిస్తున్నారని, ప్రతి గ్రామంలో సగటున రోజుకు 45 మంది వరకు వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు కదలలేని స్థితిలో వున్న రోగుల ఇళ్లకే వెళ్లి వైద్య పరీక్షలు అందిస్తున్నారని వివరించారు. ప్రజలకు మండల కేంద్రాలకు రాకుండానే గ్రామాల్లోనే వారికి అవసరమైన అన్ని ప్రభుత్వ సేవలను సచివాలయాల ద్వారా అందించడంతో పాటు, ధాన్యం కొనుగోలు, పంటల నమోదు, పంటల బీమాతో పాటు ఇతర సంక్షేమ పథకాలను అందిస్తున్నామన్నారు. గ్రామ స్థాయిలో వున్న ప్రభుత్వ సేవలను ప్రతి ఇంటి ముంగిటకు అందించాలనే లక్ష్యంతో జగనన్న సురక్ష అనే పేరుతో సచివాలయాల్లో ప్రత్యేకంగా కార్యక్రమాలు జూన్ 23 నుండి నిర్వహిస్తున్నామని, జిల్లాలో ఇప్పటికే 50 శాతం సచివాలయాలకు అధికారులు వెళ్లి ప్రజలకు అవసరమైన ప్రభుత్వ సేవల ధ్రువపత్రాలను అందిస్తున్నారని తెలిపారు.

నిత్యావసర ధరల తగ్గింపునకు చర్యలు

- తొలిగా అర్బన్ ప్రాంతాల్లో నియంత్రణకు ప్రభుత్వం నిర్ణయం
- మిల్లర్లు, వ్యాపారులతో జాయింట్ కలెక్టర్ల సమీక్ష

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా



సమీక్షల్లో మాట్లాడుతున్న పల్నాడు, గుంటూరు జాయింట్ కలెక్టర్లు

నిత్యావసర సరుకుల ధరలును తగ్గించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, తొలిగా అర్బన్ ప్రాంతాల్లో ఈ చర్యలు ఉంటాయని పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ చెప్పారు. రైస్ మిల్లర్లు, డాల్ మిల్లర్లు, చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులతో కలెక్టరేట్‌లోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ హాలులో గురువారం సమీక్షించారు. ధరల అదుపునకు వ్యాపారులంతా సహకరించాలని కోరారు. మాచర్ల, దాచేపల్లి, పిడుగురాళ్ల, సత్తెనపల్లి, నరసరావుపేట, చిలకలూరిపేట, వినుకొండ వంటి మున్సిపాలిటీల రైస్‌మిల్లర్లు, దాల్ మిల్లర్లు, హోల్ సేల్ వ్యాపారులు సైతం ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు అమ్మకాలు చేపట్టాలని ఆదేశించారు. నిత్యావసర వస్తువులను మార్కెట్ ధరల కంటే తక్కువగా అమ్మాలని, నాణ్యమైన సార్టెక్స్ బియ్యం రూ.49కు, దేశవాళీ కందిపప్పు రూ.135కు, ఆఫ్రికన్ వెరైటీ కందిపప్పు రూ.120కు అమ్మాలని ఆదేశించారు. నిబంధనలు మీరితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వం నిర్దేశించిన ప్రత్యేక కౌంటర్ల ద్వారా అమ్మకాలు శుక్రవారం నుంచి చేపడుతున్నట్లు ప్రకటించారు. పలు అంశాలపై జిల్లా సివిల్ సప్లయీస్ అధికారి పద్మశ్రీ, జిల్లా మార్కెటింగ్ శాఖ

2లో



అడవిని మేస్తున్న కంచె

కలప అక్రమ తరలింపులో అటవీశాఖ ఉద్యోగి భాగస్వామ్యం

ప్రజాశక్తి - కారెంపూడి

అక్రమార్కులతో కలిసి అటవీశాఖ ఉద్యోగే కలపను అక్రమంగా తరలించడం గురువారం వెలుగులోకి వచ్చింది. వివిధ ప్రాంతాల నుండి కలపను మండలంలోని ఒప్పిచర్ల గ్రామంలో ఉన్న గురజాల రోడ్డుకు తెచ్చి అక్కడి నుండి లారీల ద్వారా తరలిస్తున్నారు. అటవీశాఖ ఉద్యోగి కోటేశ్వరరావు, గ్రామానికి చెందిన నాగరాజు కొన్నేళ్లుగా ఇలా అక్రమంగా రవాణా చేస్తున్నారు. దీనిపై కారంపూడి చెందిన అటవీశాఖ సిబ్బంది అమీర్ జానీ, లక్ష్మనాయక్, వీఆర్వో కోటేశ్వరరావుకు సమాచారం అందడంతో తనిఖీలు చేపట్టి రూ.లక్షల కలపను స్వాధీనం చేసుకున్నారు. ఒప్పిచర్ల అటవీ ప్రాంతం దుర్గి మండల పరిధిలో ఉండటంతో ఆ ప్రాంత సెక్షన్ ఆఫీసర్ వెంకయ్య కేసు నమోదు చేశారు.



డిఇఒ ఆఫీసు ఎదుట నిరసన తెలియచేస్తున్న ఉపాధ్యాయులు

సిఫార్సు బదిలీలు ఆపాలి

డిఇఒ కార్యాలయం ఎదుట యుటిఎఫ్ నిరసన, వినతి

ప్రజాశక్తి-గుంటూరు

కౌన్సెలింగ్ బదిలీలను అపహస్యం చేస్తూ ప్రభుత్వం చేపట్టిన సిఫార్సు బదిలీలను ఆపాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.ఆదిలక్ష్మి, ఎం.కళాధర్ డిమాండ్ చేశారు. సిఫార్సు బదిలీలు ఆపాలని, కౌన్సెలింగ్ ద్వారా బదిలీ అయిన టీచర్లకు వెంటనే జీతాలు విడుదల చేయాలని తదితర సమస్యలపై డిఇఒ కార్యాలయం ఎదుట గురువారం నిరసన తెలిపి డిఇఒకు వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర సహాధ్యక్షులు ఎఎన్.కుసుమ కుమారి మాట్లాడుతూ బదిలీల కౌన్సెలింగ్ జరిగి 10 రోజులు కూడా కాకుండానే పోస్టులు దాచిమరీ అక్రమ బదిలీలు జరపటం సిగ్గుచేటన్నారు. రాష్ట్ర ప్రచురణల కమిటీ చైర్మన్ ఎం.హనుమంతరావు మాట్లాడుతూ రాత్రి పగలు ఇళ్ల వెంటే తిరుగుతూ ఉపాధ్యాయులను చిన్నచిన్న కారణాలకే సస్పెండ్ చేస్తున్న ప్రవీణ్ ప్రకాష్ సిఫార్సు బదిలీలకు సమాధానం చెప్పాలని

2లో



పెండింగ్ కేసుల దర్యాప్తు పూర్తి చేయండి

జిల్లా నేర సమీక్షలో ఎస్‌పి ఆరీఫ్ హఫీజ్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న కేసుల దర్యాప్తును సత్వరమే పూర్తిచేయాలని జిల్లా ఎస్‌పి ఆరీఫ్ హఫీజ్ అన్నారు. గురువారం జిల్లాపోలీసు కార్యాలయంలో జరిగిన నేరసమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ హత్యలు, అత్యాచారాలకు సంబంధించిన కేసులలో నిందితులపై రౌడీషీట్ తెరవాలన్నారు. జిల్లాలో ప్రతిపోలీస్ స్టేషన్ పరిధిలో ముఖ్యమైన ప్రాంతాల్లో పర్యటించి అక్కడ సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. జైలు నుండి బయటకు వచ్చిన వారిపైనా, రౌడీషీటర్ల కదలికలపై నిఘా ఉంచాలన్నారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో కేటాయించిన దిశా పోలీసు వాహనాలను కాలేజీలు, హైస్కూల్ దగ్గర బస్ స్టాండ్ సెంటర్‌లలో గస్తీ నిర్వహించాలని ఆదేశించారు. బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించే 5908 మందిపై 5626 కేసులు నమోదుచేసి కఠిన చర్యలు తీసుకున్నామని తెలిపారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల సరఫరాను నిరోధించాలన్నారు. ఏదైనా దొంగతనం జరిగిన వెంటనే సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకొని, నేరస్థుడు వదిలిన సాక్ష్యాధారాలు, సిసి కెమెరాల ఫుటేజీలను క్రోడీకరించి నిందితులను వెంటనే పట్టుకుని సొత్తును స్వాధీనం చేసుకోవాలని చెప్పారు.



రోడ్డు ప్రమాదంలో కార్మికుడు మృతి

ప్రజాశక్తి - రెంటచింతల

మండల కేంద్రమైన రెంటచింతలలోని గోలి వాగు సమీపంలో గురువారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువ కార్మికుడు మృతి చెందాడు. ఎస్ఐ సమీర్‌బాష వివరాల ప్రకారం.. ప్రకాశం జిల్లా పుల్లలచెరువు మండలం పిఆర్సీ తండాకు చెందిన రమావత్ గోవింద నాయక్ (28) రెంటచింతలలోనే సిమెంట్ బ్రిక్స్ తయారీ సంస్థలో కార్మికునిగా పనిచేస్తున్నాడు. ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళుతున్న గోవింద నాయక్ గోలి వాగు సమీపంలో అదుపుతప్పి బైక్ మీద నుండి కిందపడ్డాడు. గమనించిన స్థానికులు కాపాడే ప్రయత్నం చేసినా కొద్దిసేపటికి ప్రాణాలు విడిచాడు. మృతుని భార్య జమునబాయి ఐదేళ్ల క్రితం మృతి చెందగా వీరిక ఇద్దరు పిల్లలున్నారు.

కారెంపూడి ఎంఇఒ-2గా కాంతారావు

ప్రజాశక్తి - కారెంపూడి

కారెంపూడి ఎంఇఒ-2గా కె.కాంతారావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. విజయపురిసౌత్ ప్రభుత్వ పాఠశాలలో విధులు నిర్వహిస్తూ ప్రమోషన్‌పై ఇక్కడికి వచ్చారు. ఇప్పటివరకు ఇన్చార్జి ఎంఈవోగా నాగయ్య బాధ్యతలు నిర్వర్తించారు. కారెంపూడి ఎంఇఒ-1 రవికుమార్ పాఠశాలల తనిఖీలు బాధ్యతలు, కాంతారావు పరిపాలన, ఉపాధ్యాయుల పనితీరును పరివేక్షించనున్నారు. ఎంఇఒలను ఉపాధ్యాయులు స్థానిక మండల విద్యా వనరుల కేంద్రంలో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకట కోటయ్య, బిక్షమయ్య, యకసిరి వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.



కల్తీ విత్తనాలపై కఠిన చర్యలు

(మొదటి పేజీ తరువాయి)

నిర్మూలనకు శాశ్వత చర్యలు చేపట్టాలన్నారు. కాల్వలనిండా నీరు ఉన్నా తూటికాడ, గుర్రపు డెక్క తొలగించకపోవడం వల్ల కట్టలు తెగిపోయి ప్రమాదం జరగవచ్చన్నారు. చేనేత కార్మికులు తయారు చేసిన వస్త్రాలను ఆప్కో ద్వారా కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

మునిసిపల్ పాఠశాలలో టీచర్లను నియమించాలి : కల్పలత

ఎమ్మెల్సీ కల్పలతరెడ్డి మాట్లాడుతూ ఇటీవల విద్యాశాఖలో విలీనమైన మున్సిపల్ పాఠశాలల్లో విద్యార్థులకు అనుగుణంగా ఉపాధ్యాయుల నియమకానికి చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా పరిషత్ స్కూల్సులో నాన్‌టీచింగ్ స్టాఫ్‌ను నియమించాలన్నారు.

జగనన్న కాలనీలకు అప్రోచ్ రోడ్డు వేయాలి :ఆర్‌కె

పేదలందరీకి ఇళ్ల పథకం లే అవుట్‌లకు పూర్తి స్థాయిలో అప్రోచ్ రోడ్లు ఏర్పాటు చేయాలని మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి కోరారు. రహదారులు లేక కాలనీల్లో పనులు జరగడం లేదన్నారు. గ్రావెల్ రోడ్లు ఒక్క వర్షానికే దెబ్బతింటున్నాయని చెప్పారు. గుంటూరు ఛానల్ విస్తరణ, పొడిగింపు పనులు వెంటనే ప్రారంభించాలని, కట్టలను పటిష్ట పర్చాలని కోరారు. పెదవడ్లపూడి హైలెవల్ చానల్ పెండింగ్ పనులకు పూర్తి చేయాలన్నారు. ఉద్యాన శాఖ ద్వారా పండ్ల తోటల పెంపకానికి అందిస్తున్న ప్రోత్సాహకాలపై గ్రామస్థాయిలో విస్తృత ప్రచారం కల్పించాలన్నారు.

కాల్వల మరమ్మతులు సకాలంలో జరగాలి : రోశయ్య

గుంటూరు చానల్‌తో పాటు, ఇతర సాగునీటి కాల్వల్లో తూటికాడ తొలగింపు, నిర్వహణ పనుల కాంట్రాక్టర్లు సక్రమంగా చేపట్టేలా ఇరిగేషన్ అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని పొన్నూరు ఎమ్మెల్యే కిలారు వెంకట రోశయ్య కోరరు. పనులు పూర్తయిన తరువాత సంబంధిత గ్రామాల అధికారులు, సర్పంచులతో ధ్రువీకరణ పత్రం తీసుకోవాలన్నారు. ప్రభుత్వ భవనాల నిర్మాణానికి సేకరించిన భూములపై కోర్టులలో వేసిన కేసులపై రెవెన్యూ అధికారులు సరియైన రిట్‌లు వేసి స్టేలు తొలగింపుకు చర్యలు తీసుకోవాలన్నారు. తెనాలి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ మాట్లాడుతూ మన బడి నాడు-నేడు అభివృద్ధి పనులు వెంటనే పూర్తి చేయాలని, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల డ్రాప్ ఔట్స్ లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆస్పత్రుల్లో ధరల బోర్డులు ఉండాలి : ఎమ్మెల్యే ముస్తాఫా

గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ ముస్తఫా మాట్లాడుతూ మౌలిక సదుపాయాలు కల్పించిన అడవి తక్కెళ్లపాడులో టిడ్కో గృహాలను లబ్దిదారులకు పంపిణీ చేయాలన్నారు. అంజుమన్ స్కూల్‌లో మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయాలన్నారు. ప్రైవేట్ వైద్యశాలల్లో, పరీక్షా కేంద్రాల్లో వ్యాధి నిర్ధారణ పరీక్షల ధరల బోర్డులను ప్రదర్శించేలా చర్యలు తీసుకోవాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా అధిక ధరలు వసూలు చేస్తున్నారని అన్నారు. ఈనెలాఖరు కల్లాఅడవి తక్కెళ్లపాడులో టిడ్కో ఇళ్లు లబ్ధిదారులకు ఇస్తామన్నారు.

కౌలు రైతులకు రుణాలు ఇప్పిస్తాం : కలెక్టర్

జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ కౌలు రైతులందరికి పంట రుణాలు అందించేందుకు బ్యాంకుల వారీగా లక్ష్యాలు నిర్దేశించి ప్రతివారం సమీక్షిస్తున్నామని చెప్పారు. అమ్మ ఒడి నగదు జమకు సంబంధించి సమస్యలుంటే సచివాలయ విద్యా కార్యదర్శిని సంప్రదించి పరిష్కరించుకోవచ్చన్నారు. మంగళగిరిలో ఎయిమ్స్‌కు అక్టోబర్ నాటికి పైప్‌లైన్ ద్వారా నీటి సరఫరాకు చర్యలు తీసుకుంటామని అన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి, నగరకమిషనర్ చేకూరి కీర్తి, తెనాలిసబ్ కలెక్టర్ గీతాంజలిశర్మ, అసిస్టెంట్ కలెక్టర్ శివన్నారాయణ, డిసిసిబి ఛైర్మన్ రాతంశెట్టి సీతారామాంజనేయులు, డిసిఎంఎస్ చైర్ పర్సన్ భాగ్యలక్ష్మీ, జిల్లా రెవెన్యూ అధికారి కె.చంద్రశేఖరరావు పాల్గొన్నారు.





సమావేశంలో ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు

బస్సులో పిల్లల్ని పరిమితంగానే ఎక్కించాలి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

బడి బస్సు భద్రంగా నడపాలని పట్టణ పరిధిలోని విద్యా సంస్థల బస్సు డ్రైవర్లకు నరసరావుపేట డిఎస్పీ కెవి మహేష్ సూచించారు. ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన భద్రతా చర్యలపై విద్యా సంస్థల బస్సుల డ్రైవర్‌లకు స్థానిక డీఎస్పీ కార్యాలయంలో గురువారం అవగాహన కల్పించారు. డీఎస్పీ మాట్లాడుతూ చిన్నారులను ఇంటి నుండి విద్యా సంస్థకు తిరిగి ఇంటికి సురక్షితంగా చేర్చే క్రమంలో డ్రైవర్లది ప్రధాన పాత్ర అన్నారు. విద్యార్థులను తరలించే బస్సులు యాజమాన్యాలు బస్సు సామర్థ్యంపై ఎప్పటికప్పుడు పరీక్షలు చేయిస్తూ ప్రమాదాల నివారణకు కషి చేయాలన్నారు. విద్యార్థులు బస్సు ఎక్కేటప్పుడు దిగేటప్పుడు సహాయకులు ఉండాలన్నారు. గత ప్రమాదాలను దృష్టిలో పెట్టుకుని నివారణకు తమ వంతు కషి చేయాలని సూచించారు. బస్సులో ప్రథమ చికిత్స కిట్లు, అత్యవసర ద్వారం రవాణా శాఖ అధికారులు సూచించిన నిబంధనలు తప్పనిసరిగా విద్యా సంస్థల యాజమాన్యాలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే ఉపేక్షించబోమని హెచ్చరించారు. త్వరలో వినుకొండ, చిలకలూరిపేట పట్టణాల్లోని విద్యా సంస్థల బస్సు డ్రైవర్‌లకు అవగాహన కల్పిస్తామన్నారు.



డ్రైవర్‌లతో మాట్లాడుతున్న డిఎస్పీ కెవి మహేష్



నోటు పుస్తకాలు పంపిణీ చేస్తున్న నాసరయ్య

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సహాయ పడాలనే ఉద్దేశ్యంతో విద్యార్థులకు రూ 20 వేలు విలువైన నోటు పుస్తకాలను పంపిణీ చేసినట్లు నరసరావుపేట కృష్ణవేణి డిగ్రీ కళాశాలల డైరెక్టర్ కోమటినేని నాసరయ్య అన్నారు.రొంపిచర్ల మండలంలోని కొత్తపల్లి గ్రామంలో గల జిల్లా పరిషత్ మరియు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు కుటుంబ సభ్యులతో కలిసి పంపిణీ చేశారు. తమ కళాశాల ఆధ్వర్యంలో నరసరావుపేట మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం బి.హోసన్న, పేరెంట్స్ కమిటీ చైర్మన్ నందిగం ఏసుదానం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇష్టారాజ్యంగా మట్టి తవ్వకాలు

ప్రజాశక్తి - బెల్లంకొండ

మండలంలోని వన్నాయపాలెంలో నిబంధనలకు విరుద్ధంగా మట్టి తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. సుమారుగా ట్రక్కు రూ.800 నుండి రూ. వెయ్యికి విక్రయిస్తున్నారు. దీనిపై ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.



మొదటి పేజీ తరువాయి

కౌల్దార్లకు రుణాలివ్వడం లేదు

సర్కిల్ ఏర్పాటుకు భూమి కేటాయించాలన్నారు. రెవెన్యూశాఖ భూమి కేటాయిస్తే బిసి సంక్షేమ శాఖ భవనం నిర్మాణానికి నిధులు ఇస్తుందన్నారు. రెండు శాఖల మధ్య సమన్వయం లేకపోవడం వల్ల ఒకరిపై మరొకరు చెప్పుకుంటూ కాలయాపన చేస్తున్నారన్నారు. గతేడాది తామర తెగులు వల్ల నష్టపోయిన రైతులకు పరిహారం అందలేదన్నారు. కృష్ణా జిల్లాలో కొన్నిచోట్ల రూ.45వేలు, కొంతమందికి రూ.18 వేలు చొప్పున ఇచ్చారని గుంటూరు జిల్లాలో పరిహారం ఇవ్వలేదని తెలిపారు. బీమా కంపెనీలు ఇవ్వకపోతే ప్రభుత్వమే ఇవ్వాలన్నారు.

నిత్యావసర ధరల తగ్గింపునకు చర్యలు

అధికారి సూర్య ప్రకాష్ సూచనలు చేశారు.

ప్రజాశక్తి-గుంటూరు

బియ్యం, పప్పుధాన్యాల ధరల నియంత్రణపై జిల్లా సంయుక్త కలెక్టర్ జి.రాజకుమారి, పౌరసరఫరాల అధికారులు, మార్కెటింగ్ అసిస్టెంట్ డైరెక్టర్, మార్క్‌ఫెడ్ డిప్యూటీ మేనేజర్ తదితరులతో కలిసి రైస్ మిల్లర్లు, పప్పు ధాన్యాల సంఘాల అధ్యక్షులతో సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం మార్కెట్‌లో బియ్యం ధరలు స్టీం బియ్యం కిలోరూ.50, రా బియ్యం కిలో రూ.56 ఉన్నాయని, మినపగుళ్ల కిలో రూ.115లు ఉన్నాయని రైస్ మిల్లర్లు, పప్పు ధాన్యం వ్యాపారులు తెలియజేశారు. సామాన్యుడికి బియ్యం, పప్పు ధాన్యాల ధరల అందుబాటులోకి తీసుకురావడానికి సమావేశంలో వ్యాపారులతో చర్చలు నిర్వహించారు. రైతు బజార్లలో స్టీం బియ్యం కిలో రూ.44లు, రా బియ్యం ఒక కేజీ రూ.48, మినపగుళ్ల రూ.101 చొప్పున విక్రయించేలా సహకరించాలని కోరారు. రైతు బజార్లలో ఉన్న కౌంటర్ల నందు బిపిటి బియ్యం మీ అందుబాటులో ఉంటాయని అధికారులు తెలియజేశారు.

సిఫార్సు బదిలీలు ఆపాలి

డిమాండ్ చేశారు. జిల్లా సహాధ్యక్షులు జి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జీతాల సమస్యలను తక్షణమే పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శులు సిహెచ్.ఆదినారాయణ, ఎమ్‌డి షకీలాబేగం, జి.వెంకటేశ్వరరావు, కె.రంగారావు, కె.ప్రభూజీ, కె.ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

అర్హులైన అందరికీ సంక్షేమ పథకాలు

నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు

ప్రజాశక్తి-గుంటూరు :అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించటానికి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిందని నగర మేయర్ కావటి శివనాగ మనోహర్ నాయుడు అన్నారు. గురువారం నగరంలోని 31వ డివిజన్‌లోని ఏ.టి అగ్రహారం 4వ లైన్‌లో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో మేయర్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా వివిధ అంశాల్లో దరఖాస్తు చేసుకున్న వారికీ ధ్రువపత్రాలను అందించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు అందుగుల సంతోష్, పడాల సుబ్బారెడ్డి, డిప్యూటి కమిషనర్ వెంకటకష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

20వ డివిజన్‌లో సిసి రోడ్డు, డ్రైన్ల నిర్మాణానికి శంకుస్థాపన..

స్థానిక గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలోని 20వ డివిజన్‌లోని పార్వతీపురంలో రూ.45లక్షలతో సి.సి రోడ్లు, డ్రైన్లు నిర్మాణానికి నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు శంకుస్థాపన చేశారు. డివిజన్ పరిధిలో ఇప్పటకే రామనామ క్షేత్రం ప్రధాన రహదారి విస్తరించి, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. నగరంలో సుమారు రూ.200 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు.కార్యక్రమంలో కార్పొరే టర్లు నిమ్మల వెంకటరమణ, గేదెల నాగరంగమణి రమేష్, వైసిపి 20వ డివిజన్ పార్టీ అధ్యక్షులు కంతేటి శ్యాంశేఖర్ పాల్గొన్నారు.

శ్రీనివాసరావుపేట స్మశాన వాటికి అభివృద్ధికి చర్యలు..

శ్రీనివాసరావుపేటలోని హిందూ స్మశాన వాటికను అన్ని విధాలుగా అభివద్ధి చేయటానికి చర్యలు తీసుకుంటున్నట్లు నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు తెలిపారు. గురువారం జిఎంసి ఆధ్వర్యంలో రూ.6కోట్లతో నిర్వహిస్తున్న అభివృద్ధి పనులను మేయర్ తనిఖీ చేశారు. మేయర్ మాట్లాడుతూ జిఎంసి పరిధిలోని స్మశానాల అభివద్ధికి ప్రత్యేక కార్యచరణ ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. గుంటూరు నగరంలోని శ్రీనివాసరావు తోటలోని స్మశాన వాటికను నగరంలోని 8 డివిజన్లలోని సుమారు లక్ష మంది ప్రజలు వినియోగిస్తున్నా రన్నారు.



మాట్లాడుతున్న మేయర్ కావటి మనోహర్‌నాయుడు

ప్రస్తుతం ఈ ప్రాంతాల్లో నివసించే ప్రజలు కర్మకాం డలు నిర్వహించటానికి బస్టాండ్ వద్ద గల సత్రాన్ని వినియోగి స్తున్నారని, ఇకనుంచి కర్మకాండలు శ్రీనివాసరావుపేట స్మశాన వాటికలోనే నిర్వహించుటకు వీలుగా సత్రాన్ని కూడా నిర్మిస్తున్నా మన్నారు. అలాగే గ్రీనరీ, గదులు, భోజనశాల, వంటశాల, కేశకండనం, సాన్నపు గదులు, అస్థికలు భద్రపరుచు గదులు, స్మశాన వాటిక బయట రోడ్డు విస్తరణ, లైటింగ్, తదితర సౌకర్యాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వివిధ డివిజన్ల కార్పొరే టర్లు నిమ్మల వెంకటరమణ, గేదెల నాగ రంగమణి పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

ప్రజాశక్తి - మేడికొండూరు



మాట్లాడుతున్న కత్తెర సురేష్ కుమార్

ప్రజా సమస్యలు తెలుసుకున్న వెంటనే అధికారులు వాటిని పరిష్కరించాలని తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ అన్నారు. మేడికొండూరు మండల సర్వసభ్య సమావేశం గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మన్నవ స్వప్న అధ్యక్షతన జరిగినంది. ఈ కార్యక్రమంలో కత్తెర సురేష్ కుమార్ మాట్లాడుతూ గత సర్వసభ్య సమావేశంలో వివిధ శాఖల అధికారులు తీసుకున్నటువంటి టార్గెట్ల పనుల వివరాలను శాఖల వారీగా అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుత వర్ష భావ పరిస్థితులలో గ్రామాలలో పారిశుధ్యం, డ్రైనేజీ పనులు మెరుగుపరచాలని అన్నారు. గ్రామాలలో మౌలిక సదుపాయాలు ఎప్పటికప్పుడు పరీక్షించి మెరుగు పరచుకోవాల్సిన అవసరము ఎంతైనా ఉందన్నారు. సమావేశంలో మండలంలోని పేరేచర్ల మేడికొండూరు గ్రామాల పరిధిలో విద్యుత్ సమస్యలు ఎక్కువగా ఉన్నప్పటికీ విద్యుత్ శాఖ అధికారులు ఫోన్ చేసినా పట్టించుకోవడం లేదని సభ దృష్టికి మేడికొండూరు సర్పంచ్ నాగమణి , పేరేచర్ల సర్పంచ్ దేవరకొండ రాజ్ కుమార్ తీసుకువచ్చారు. వాటిని పరిష్కరించే దిశగా చర్యలు చేపడతామని విద్యుత్ శాఖ అధికారులు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీవో కే ప్రభాకర్ రావు, జడ్పిటిసి సభ్యులు కందుల సిద్దయ్య , వివిధ శాఖల మండల అధికారులు పాల్గొన్నారు.



పొన్నూరు ఇఒ కార్యాలయం వద్ద ఆందోళనలో ధూళిపాళ్ల

దేవాలయ భూముల్ని కాపాడుకోవాలి : ధూళిపాళ్ల

ప్రజాశక్తి - పొన్నూరు రూరల్

పొన్నూరు శ్రీ సాక్షి భవనారాయణ స్వామి వారి భూములను భూ బకాసుల నుండి కాపాడుకుందామని మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర తెలిపారు. గురువారం ఇఒ కార్యాలయం వద్ద టిడిపి నాయకులు, దూళిపాళ్ల అందోళన నిర్వహించారు. ఈసందర్భంగా ధూళిపాళ్ల మాట్లాడారు. దేవాదాయ శాక అధికారులతో కలసి స్థానిక ఎమ్మెల్యే దేవాలయం భూములు కాజేయడానికి పథకం పన్నారన్నారు. కార్యాలయంలో ప్రైవేటు దందాలకు తెరతీసి ఆటోనగర్ పేరుతో రైతులను మోసం చేసి దొంగ సంతకాలు తీసుకున్నారని విమర్శించారు. దేవ స్థానానికి చెందిన 9 ఎకరాల భూమిని అక్రమించడానికి ప్రయత్నిస్తున్నారని దుయ్యబట్టారు.ఎమ్మెల్యే పథకం ప్రకారం దేవాలయ భూములను 33 సంవత్సరాల లీజుకి ప్రతిపాదించారని దేవాలయ భూములు కొట్టేసేందుకే ఎమ్మెల్యే భార్యను ట్రస్ట్ బోర్డు మెంబర్‌గా చేశారన్నారు. రైతుల లీజు గడువు పూర్తికాకుండానే ఎమ్మెల్యే పథకం ప్రకారం ఆస్తులను తన అనుచరులకు కట్టబెట్టడానికి తెర తీశారన్నారు భావనారాయణ స్వామి దేవాలయ ఈవో రైతులను మోసపూరితంగా సంతకాలు చేయించుకొని కోట్ల రూపాయల భూముల కుంభకోణంలో భాగస్వామి అయిందన్నారు.

అనారోగ్యంతో విద్యార్థిని మృతి

ప్రజాశక్తి - మాచర్ల :పదవ తరగతి విద్యార్థిని మృతి స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న ఆలేటి సలోమి 15 పాఠశాలలోనే తలనొప్పి అంటూ పడిపోయింది. వెంటనే ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మాచర్ల మండలం జమ్మలమడక గ్రామానికి చెందిన సలోమి అనారోగ్యంతో మృతి చెందిందని, పోస్టుమార్టం కూడా అవసరం లేదని మృతదేహాన్ని తమ గ్రామానికి తీసుకెళ్లారు.

100 మంది సెల్‌ఫోన్లు అందచేత

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

జిల్లాలోని వివిధ ప్రదేశాల్లో సెల్ ఫోన్లు పోగొట్టుకున్న సుమారు 100 మంది బాధితులకు వివిధ కంపెనీల సెల్ ఫోన్ ట్రేస్ చేసి సంబంధిత ఫిర్యాదు దారులకు జిల్లా ఎస్‌పి ఆరీఫ్ హాఫీజ్ గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆరిఫ్ హాఫీజ్ మాట్లాడుతూ తాము ఇచ్చిన సెల్ ఫోన్ వాట్సప్ నెంబర్ కు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని తెలిపారు. అదే విధంగా జిల్లా వ్యాప్తంగా కాకుండా ఇతర జిల్లా ల నుండి సెల్ ఫోన్ పోగొట్టుకున్న బాధితులు వాట్సప్ నెంబర్ కు మెసేజ్ లు వస్తున్నాయని తెలిపారు. వాట్సప్ నెంబర్ అయినా 8688831574 కు మెసేజ్ రాగానే అందుకు సంబంధించిన వివరాలను సేకరించి ఫోన్లు అందిస్తున్నామని అన్నారు. సెల్ ఫోన్ తీసుకున్న బాధితులు ఎస్పీ కతజ్ఞతలు తెలియజేశారు. జిల్లా అడిషనల్ ఎస్పి సుప్రజ, స్పెషల్ బ్రాంచి బ్రాంచ్ డిఎస్పి సుభాష్ స్పెషల్ బ్రాంచ్ సిఐ నరసింహారావు పాల్గొన్నారు.

చోరీ కేసులో ఇద్దరు అరెస్ట్

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

రాష్ట్రంలోనే పలు ప్రాంతాలలో ద్విచక్ర వాహనాలను చోరీ చేస్తున్న పిడుగురాళ్లకు చెందిన ఇరువురిని అరెస్టు చేసినట్లు పిడుగురాళ్ల సిఐ పసుపులేటి ఆంజనేయులు గురువారం ఓ ప్రకటనలో తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన వివరాలు తెలుపుతూ పిడుగురాళ్ల పట్టణానికి చెందిన షేక్ మహమ్మద్ రఫీ, షేక్ సైదా అని ఇరువురు యువకులు చెడు వ్యసనాలకు బానిసలై పలు ప్రాంతాలలో ద్విచక్ర వాహనాలను చోరీ చేసి అమ్ముకుంటున్నట్లు తెలిపారు. వారి వద్ద నుంచి 13 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఇరువురిని అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరుస్తామన్నారు.



మిర్చి నిల్వలు

బ్యాగులు

మిర్చి దిగుమతి	: 36,610
మిర్చి ఎగుమతి	: 40,535
మిర్చి నిల్వ	: 12,085

మిర్చి ధరలు

రూపాయలలో

334	10,000 - 23,500
నెం.5	10,500 - 20,500
273	16,200 - 19,700
341	11,700 - 23,500
4884	15,000 - 16,000
సూపర్ 10	120000 - 23,000
నాన్ ఎసి	
తేజ	9,500 - 24,500
బడిగి	10,000 - 25,500
దేవనూరు డీలక్స్	11,500 - 21,200
తాలుకాయలు	5,000 -14,500
	ఎసి
334	10,000 - 22,000
నెం.5	20,500 -20,500
273	20,000 - 20,000
341	10,500- 21,000
4884	21,700 - 21,700
తేజ	10,000 - 24,200
బడిగి	15,000 - 24,000
దేవనూరు డీలక్స్	21,500 - 22,500
తాలుకాయలు	7,000 -13,000



ఫోర్టిఫైడ్ బియ్యంపై అపోహాలొద్దు

ప్రజాశక్తి-తాడేపల్లి :ఎఫ్‌సిఐ ద్వారా సరఫరా చేస్తున్న ఫోర్టిఫైడ్ బియ్యంపై అపోహాలొద్దని ఎఫ్‌సిఐ డిజిఎం జయప్రకాష్ తెలిపారు. గురువారం తాడేపల్లిలోని ఫుడ్ కార్పొరేషన్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎఫ్‌సిఐ గూడౌన్లలో నిల్వ ఉన్న బియ్యాన్ని పరిశీలిచారు. జాతీయ ఆహార పథకం కింద కేంద్ర ప్రభుత్వం 8,135 కోట్లకు పైగా లబ్దిదారులకు ఉచితంగా ఆహార ధాన్యాలను పంపిణీ చేస్తుందని చెప్పారు. పోషకాహార లోపం నివారణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. రాష్ట్రాలకు, కేంద్ర పాలిత ప్రాంతాలకు నూరు శాతం పోర్టిఫైడ్ బియ్యాన్ని కేటాయించేందుకు తగిన చర్యలు తీసుకున్నామన్నారు. కుటుంబ సభ్యునికి ఐదు కిలోల చొప్పున ఎంత మంది సభ్యులుంటే అంత మందికి పోర్టిఫైడ్ బియ్యం సరఫరా చేస్తామని తెలిపారు. ఇవన్నీ ఉచితంగానే అందజేయబడతాయని వివరంచారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ మేనేజర్ హుస్సేన్, ఎజిఎం మనోజ్‌కుమార్, టి.రాంప్రసాద్, ఏలూరు మేనేజర్ కిరణ్, ఆలిండియా వర్కర్స్ యూనియన్ కమిటీ సభ్యులు డి.సుందరరావుయాదవ్ పాల్గొన్నారు.

జగన్ చిత్రపటానికి పాలాభిషేకం

ప్రజాశక్తి-తాడేపల్లి : సిఎం జగన్ చిత్రపటానికి మాదిగ, రెల్లి కార్పొరేషన్ చైర్మన్లు కె.కనకారావు, వి.మధుసూదనరావు తాడేపల్లి మున్సిపల్ జోనల్ కార్యాలయం ముందు గురువారం పాలాభిషేకం నిర్వహించారు. దళిత రైతులకు చెందిన 60 వేల ఎకరాల అసైన్డ్ భూములు వారికి ప్రయోజనం చేకూరే విధంగా యాజమాన్య హక్కులు కల్పిస్తూ మంత్రివర్గంలో తీసుకున్న నిర్ణయాన్ని హర్షిస్తున్నట్లు తెలిపారు. భూమి లేని వారికి లంక భూములు కేటాయించడానికి కూడా అనుమతివ్వడం పట్ల సిఎంకు అభినందనలు తెలిపారు. ఈనాం భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించడాన్ని స్వాగతించారు. ఈ కార్యక్రమంలో గుంటూరు, కృష్ణ, ఎన్‌టిఆర్ జిల్లాల వికలాంగుల విభాగం రీజనల్ కోఆర్డినేటర్ దొండపాటి మధుకిరణ్, పట్టణ ఎస్‌సి సెల్ కార్యదర్శి ఎం.ప్రకాష్ పాల్గొన్నారు.

కౌలురైతులకు రుణాల కోసం ధర్నా, వినతి

ప్రజాశక్తి-ముప్పాళ్ల

కౌలు రైతులకు గ్రూపుల ద్వారా పంట రుణాలు ఇవ్వడంతో పాటు ప్రభుత్వ వడ్డీ రాయితీతో కూడిన పంట రుణాలను ఇవ్వాలని కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి వై.రాధాకృష్ణ డిమాండ్ చేశారు. కౌల్దార్లకు రుణాల కోసం మండల కేంద్రమైన ముప్పాళ్లలోని చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు వద్ద గురువారం ఆందోళన చేసి మేనేజర్ కిషన్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ వ్యవసాయం నష్టాల్లో సాగుతోదని, కౌలు రైతులు ప్రభుత్వ ప్రోత్సాహకాలు అందక కుటుంబాలను పోషించుకోలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. భూ యజమాని సంతకం అనే నిబంధనను



బ్యాంకు ఎదుట ధర్నా చేస్తున్న కౌలురైతులు, మేనేజర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

తొలగించి కౌలు రైతు కార్డులు ఇవ్వాలన్నారు. కౌల్దార్లందరికీ స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం గ్యారంటీ లేకుండా పంట రుణాలు ఇవ్వాలన్నారు. పంట రుణాలు భూ యాజమానికి ఇస్తే డబుల్ ఫైనాన్స్ అవుతుందంటూ కౌలు రైతులకు రుణాలు ఇవ్వడానికి బ్యాంకులు నిరాకరిస్తున్నాయని, రిజర్వు బ్యాంకు ఆదేశాల మేరకు భూమి ఆధారంగా కాకుండా పంట ఆధారంగా రుణాలు ఇవ్వాలని కోరారు. ఐదుగురు కౌల్దార్లతో కూడిన గ్రూపునకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం రూ.8 లక్షల రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కౌల్దార్లకు రుణాలివ్వడం ద్వారా ప్రైవేటు వడ్డీవ్యాపారుల బారిన పడకుండా చూడాలని మేనేజర్‌ను కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు కె.రామారావు, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జి.బాలకృష్ణ, కౌలు రైతు సంఘం నాయకులు టి.అమరలింగేశ్వరరావు, కౌలు రైతులు ఎ.శ్రీనివాసరెడ్డి, ఎ.రంగారెడ్డి, కె.రఘునాథరెడ్డి, ఎ.రామలింగారెడ్డి, ఎం.పెద్దారెడ్డి, ఎం.శ్రీను పాల్గొన్నారు.

కలప రవాణా కేసులో సిఐడి విచారణ

ప్రజాశక్తి - వినుకొండ

వినుకొండ అటవీ శాఖ కార్యాలయంలో సిబి సిఐడి అధికారులు గురువారం విచారణ చేపట్టారు. సిబిసిఐడి సబ్ ఇన్‌స్పెక్టర్ అఖిల, సిబ్బంది రికార్డులు పరిశీలించారు. 2020 జులై 23న నమోదసన కేసుపై విచారణ చేపట్టి ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్, బీట్ ఆఫీసర్ స్టేట్మెంట్‌ను రికార్డు చేశామని అఖిల చెప్పారు. అప్పటి కేసు తాలుకు రికార్డును పరిశీలించామన్నారు. రేంజ్ ఆఫీసర్ సయ్యద్ హుస్సేన్ మాట్లాడుతూ 2020లో కడప జిల్లా మైదుకూరు మండలం ఎర్రబెల్లికి చెందిన ఆగిపోయిన బ్రహ్మయ్య అనే వ్యక్తి నరసరావుపేట- చిలకలూరిపేట మధ్య ఒక పాత ఇంటి నారావేపి కలప గంతేలు దూలాలు, మొగరాలు కొనుగోలు చేసుకుని లారీలో నరసరావుపేట వెళ్లగా ఫారెస్ట్ అధికారులు సిబ్బంది గుర్తించి కేసు నమోదు చేశారని చెప్పారు. కలప అక్రమ రవాణా కింద 1.60


వివరాలు చెబుతున్న పోలీసులు

లక్షలు జరిమానా విధించా దాన్ని చెల్లించి కలపను చెన్నయ్‌లో అమ్ముకునేందుకు వెళ్లాడని, అక్కడ ఎర్రచందనమని విక్రయించే ప్రయత్నం చేయగా ఫారెస్ట్ అధికారులు కేసు నమోదు చేశారని తెలిపారు. దీనిపై సమగ్ర విచారణకు ప్రభుత్వం సిబిసిఐడీకి ఆదేశించినట్లు చెప్పారు. గతంలో నరసరావుపేటలో ఫారెస్ట్ అధికారులు తీసిన ఫొటోలు కేసు వివరాలు పరిశీలించి సమగ్ర వివరాలు సేకరించి విచారించినట్లు తెలిపారు.

ఆపదలో అన్నం పెడుతున్న అడవి

జానకాయలు, చింత చిగురుతో సేకరించి ఉపాధి పొందుతున్న మహిళలు

ప్రజాశక్తి - మాచర్ల

సరైన వర్షాల్లేక.. వ్యవసాయ పనులు మొదలవ్వక.. ఉపాధి కరువై పూట గడవడం కష్టమైన పేదలను ఆడవి తల్లి ఆదుకుంది. పొలం పనుల్లేని మాచర్ల పరిసర ప్రాంత గిరిజన మహిళలు అడవిలో రొరికే జానపళ్లను తెచ్చి పట్టణంలో అమ్ముకుని ఉపాధి పొందుతున్నారు. ఖరీఫ్ ప్రారంభమైనా సాగుకు అనువైన వర్షం ఇంకా పడకపోవడంతో వ్యవసాయ ప్రారంభం కాలేదు. వ్యవసాయ కూలీలుగా జీవించే వారు ఉపాధి లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వారంతా గ్రామాలకు దగ్గరలోని అటవీ ప్రాంతంలో జానకాయలు, చింతచిగురు సేకరించి వాటిని పట్టణంలో అమ్ముతున్నారు. వెల్దుర్తి మండలం శ్రీరామపురం తండాకు చెందిన గిరిజన మహిళలు మాచర్ల శ్రీశైలం రహదారిలోని మండాది వద్ద అటవీ ప్రాంతంలో జానకాయలు సేకరించి, వాటి అమ్మకం ద్వారా రోజు రూ.400 సంపాదిస్తున్నారు. పొలం పనులుంటే తమకు పని ఉండేదని, ప్రస్తుతం ఇంట్లో జరుగుబాటుకు ఇబ్బందిగా ఉండటంతో మహిళలం జానకాయలు అమ్మేందుకు వస్తున్నామని తండాకు చెందిన బాణావత్ లాలిబాయ్ తెలిపారు. ఉదయాన్నే అన్నం తిని 8 గంటలకు అడవికి వచ్చి, మధ్యాహ్నం 1 గంట వరకు కాయలు కోసుకోని వాటితో మాచర్లకు చేరుకుని, సాయంత్రం 4 గంటల కల్లా అమ్ముకొని


కాయల సేకరణ, విక్రయంలో మహిళలు

పొద్దుపోయేలోపు ఇంటికి చేరుతున్నామని వివరించారు. తాము సంపాదించే రూ.400లో ఛార్జీలకు రూ.100 ఆవుతుందని చెబుతున్నారు. వర్షాలు పడితే పొలం పనులు ప్రారంభం ఆవుతాయని, అప్పటి వరకు కుటుంబం గడవడానికి ఏదో తిప్పలు పడక తప్పదని మహిళలు చెబుతున్నారు. నెలరోజులుగా ఇదే దిన చర్యగా బతుకుతున్నామంటున్నారు. ప్రస్తుతం అడవిలో కాయలు కూడా అయిపోతున్నయని, వ్యవసాయ పనుల కోసం నిరీక్షిస్తున్నామని చెప్పారు.


వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, నాయకులు

ఆరోగ్య మిత్రులకు జీతాల పెంపు, ఉద్యోగ భద్రతపై త్వరలో ఆదేశాలిస్తాం

ప్రజాశక్తి - వినుకొండ : ఆరోగ్య మిత్రులకు జీతాలు పెంచి, క్యాడర్ కల్పించడంతోపాటు, ఉద్యోగ భద్రత ఇవ్వాలని ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణ్ రావు విజ్ఞప్తి చేశారు.రాష్ట్ర ఆర్థిక శాఖ కార్యదర్శి చిరంజీవి చౌదరిని అమరావతి సచివాలయంలో గురువారం కలిసి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా చిరంజీవి చౌదరి మాట్లాడుతూ ఆరోగ్య మిత్రుల జీతాల పెంపు, ఉద్యోగ భద్రత అంశాలపై సంబంధిత అధికారులకు త్వరలో ఆదేశాలు ఇస్తామని చెప్పారు. లక్ష్మణరావు మాట్లాడుతూ పదోన్నతులు కల్పించాలని, హెల్త్ కార్డులు, మెడికల్ లీవ్స్, హెచ్ఆర్‌సి కల్పించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆరోగ్య మిత్రుల యూనియన్ అధ్యక్షులు మాచర్ల బుజ్జి, ప్రధాన కార్యదర్శి దర్శనం రాంబాబు, కార్యదర్శి జె.కిరణ్ కుమార్, కుల వివక్ష పోరాట సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎ.మాల్యాద్రి పాల్గొన్నారు.

కందిపప్పు కుంభకోణంపై కేంద్ర మంత్రికి ఫిర్యాదు

ప్రజాశక్తి - వినుకొండ : ఆంధ్రప్రదేశ్ ప్రజా పంపిణీ వ్యవస్థలో నాఫెడ్ ద్వారా పేదలకు పంపిణీ చేసే కందిపప్పు టెండర్లలో రూ.700 కోట్లు కుంభకోణం జరిగిందని, దీనిపై సిబిఐ లేదా కేంద్ర వ్యవసాయ శాఖ ఉన్నతాధికారి చేత విచారణ చేపట్టాలని వినుకొండకు చెందిన ప్రముఖ వ్యాపారి బిజెపి నాయకుడు గురువారం న్యూఢిల్లీలో కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి నరేంద్ర సింగ్ తోమర్‌కు ఫిర్యాదు చేశారు. గుజరాత్ రాష్ట్రానికి చెందిన మిలాప్ ట్రేడర్స్ ప్రొప్రైటర్ ఏపీలో దొంగ లీజు అగ్రిమెంట్ పట్టించుకుని విశాఖపట్నం చెందిన కేంద్రీయ బండార్ ప్రొప్రైటర్ మస్తాన్‌రావు, విజయవాడకు చెందిన దాల్మిల్ ఓనర్ మురళి, వినకొండ చెందిన కొందరు మిల్లర్స్ సిండికేట్‌గా ఏర్పడి నాఫెడ్ సంస్థ తో కుమ్మక్కై చిన్న వ్యాపారులకు టెండర్లు దక్కకుండా రూ.700 కోట్లను స్వాహా చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

జగనన్న సురక్షను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా : దీర్ఘ కాలంగా నెలకొన్న సమస్యల పరిష్కారానికి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని లింగంగుంట్ల మాజీ సర్పంచ్, వైసిపి నాయకులు పొన్నపాటి విజయ్ కృష్ణారెడ్డి అన్నారు. మండలంలోని లింగంగుంట్ల-2 సచివాలయంలో గురువారం గ్రామసభ నిర్వహించగా తహసిల్దార్ ఆర్‌వి రమణనాయక్, ఈవోపీఆర్డి విజయ్ కుమార్ అధ్యక్షత వహించారు. విజయ్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ జగనన్న సురక్షలో భాగంగా 11 రకాల సర్టిఫికెట్లను ఉచితంగా అందజేస్తున్నామన్నారు. డివిజనల్ పంచాయతీ అధికారి డాక్టర్ రమణయ్య మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను వినియోగించుకోవాలన్నారు. లింగంగుంట్ల నుంచి వర్మీ సహజ ఎరువు ప్యాకెట్లు అమ్మకాలు మొదలయ్యాయన్నారు. అనంతరం 589 సేవలను అందించి ప్రజలకు ఉచితంగా సర్టిఫికెట్ లను అందించిన పంచాయతీ కార్యదర్శి కె.వి. శివప్రసాద్‌ను సన్మానించారు. జగనన్న సర్వే 80 శాతం పూర్తి చేసిన వాలంటీర్లకు పారితోషకం అందించారు. నాయకులు ఎన్.సత్యనారయణరెడ్డి, డి.వెంకటే శ్వర్లు, వై.వెంకటరెడ్డి, పి.పాపిరెడ్డి, కె.బ్రహ్మం పాల్గొన్నారు.




ఏసోబుకు శుభాకాంక్షలు చెబుతున్న వెంకట్రామిరెడ్డి

మాచర్ల మున్సిపల్ వైస్‌చైర్మన్‌గా ఏసోబు ఏకగ్రీవం

ప్రజాశక్తి - మాచర్ల : మాచర్ల పురపాలక సంఘంలో గురువారం జరిగిన వైస్ చైర్మన్ ఎన్నికల్లో 17వ వార్డు కౌన్సిలర్ మాచర్ల చిన్న ఏసోబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మున్సిపల్ ఇన్‌ఛార్జి చైర్మన్‌గా వ్యవహరించిన వైస్‌చైర్మన్ బోయ రఘురాంరెడ్డి తప పదవికి రాజీనామా చేయడంతో ఈ ఎన్నిక అవసరమైంది. ఎన్నికల ఒప్పందంలో భాగంగానే తొలి విడతగా బీసీ సామాజిక తరగతికి చెందిన తురక కిషోర్ మున్సిపల్ చైర్మన్ పదవి బాధ్యతలు స్వీకరించారు. ఏడాదిన్నర తర్వాత ఆయన సెలవు పెట్టడంతో వైస్ చైర్మన్‌గా ఉన్న రఘురామిరెడ్డి ఇన్‌ఛార్జి చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఏడు నెలల అనంతరం రఘురామిరెడ్డి తన పదవికి రాజీనామా చేశారు. తాజాగా ఎన్నికైన ఏసోబు ఏడాది పాటు వైస్ చైర్మన్‌గా వ్యవహరించనున్నారు. తురక కిషోర్ ప్రస్తుతం తిరిగి మున్సిపల్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టారు. ఎన్నికల అధికారిగా గురజాల ఆర్డీవో అద్దెయ్య వ్యవహరించారు. కౌన్సిల్ హాల్‌లో కౌన్సిల్ సమావేశం ప్రారంభం కాగానే ఆర్డీవో అద్దెయకు మాచర్ల చిన్న ఏసోబును తమ పార్టీ తరపున వైస్ చైర్మన్ అభ్యర్థిగా ఎంపిక చేసినట్లు బి ఫారంను వైసిపి యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి అందజేశారు. ఏసోబు అభ్యర్థిత్వాన్ని 27వ వార్డు కౌన్సిలర్ షేక్ మదర్ సాహెబ్ ప్రతిపాదించగా రెండవ వైస్ చైర్మన్ పోలూరి నరసింహారావు బలపరిచారు. మరొకరు పోటీలో లేకపోవడంతో ఏసోబు ఎన్నిక ఏకగ్రీవమైంది. ఏసోబుకు పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి, తురక కిషోర్, కమిషనర్ రమణబాబు, కౌన్సిలర్లు శుభాకాంక్షలు తెలిపారు.

సీడ్ సంక్షేమ నిధులను విడుదల చేయాలి

ప్రజాశక్తి - రెంటచింతల : సంచారజాతుల ఆర్థిక అభ్యున్నతి కోసం కేంద్రం ప్రభుత్వం ఏర్పాటు చేసిన సీడ్ పథకం ద్వారా నిధులను వెంటనే విడుదల చేయాలని రాష్ట్ర సంచార జాతుల ఉపాధ్యక్షులు అన్నపురెడ్డి కృష్ణ డిమాండ్ చేశారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఉన్న సంచార జాతుల అభ్యున్నతి కోసం కేంద్ర ప్రభుత్వం డిఎన్‌టి డెవలప్మెంట్ బోర్డును ఏర్పాటు చేసి ఐదేళ్లయినా నేటికీ ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదన్నారు. డిఎన్‌టి బోర్డుకు పాలక మండలిని ఏర్పాటు చేయాలని కోరారు.

డెల్టా నిర్వహణ... ఉల్టా...



ఐతానగర్‌లో కాలువలు సరిలేక వర్షాలకు చేలలో నిలిచిపోయిన నీరు (ఫైల్‌ఫోటో)

కృష్ణా వెస్టన్ డెల్టాలో నీటి పారుదల శాఖ పనితీరు రోజురోజుకూ దిగజారుతోంది. సాగునీటి విడుదల, క్రమబద్ధీకరణపై అధికారుల పర్యవేక్షణ పూర్తిగా కొరవడింది. నీటి పారుదల నిర్వహణలో కీలక భూమిక పోషించే లస్కర్ వ్యవస్థ పూర్తిగా కునారిల్లుతోంది. రైతుల నీటి అవసరాలకు అనుగుణంగా ఉండాల్సిన లస్కర్లలో కనీసం నాలుగో వంతు కూడా లేరు. దీనిపై అధికారుల పర్యవేక్షణ కూడా లోపించిందన్న ఆరోపణలున్నాయి. ఫలితంగా వర్షాలు, వరద ప్రవాహాలతో పొలాలు ముంపుకు గురౌతున్నాయి. కృష్ణా వెస్టన్ డెల్టా పరిధిలో పరిస్థితికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.

కృష్ణా పశ్చిమ డెల్టాలో లక్ష్యం నెరవేరని ఆధునీకరణ - అధికారుల పర్యవేక్షణ శూన్యం



దుగ్గిరాల లాకు మూసిఉన్నా పగిలిపోయిన గేటు నుంచి పోతున్న నీరు

ప్రజాశక్తి-తెనాలి:

కృష్ణా వెస్టన్ డెల్టాకు ధాన్యాగారంగా పేరుంది. ఖరీఫ్‌లో రైతులు అధిక శాతం వరి సాగు చేస్తుంటారు. ఉమ్మడి గుంటూరు, ప్రకాశం రెండు జిల్లాల్లో కృష్ణా వెస్టన్ డెల్టాలో దాదాపు 5.71లక్షల ఎకరాలు సాగులో ఉంది. మేజరు కాలువలు పది ఉన్నాయి. మెయిన్ కెనాల్, బ్యాంక్ కెనాల్, కొమ్మమూరు కెనాల్ ముఖ్యమైనవి. వాటికి అనుసంధానంగా మరో 25 బ్రాంచ్ కెనాల్స్ ఉన్నాయి. దీనికి సంబందించి నీటి నియంత్రణ, పర్యవేక్షణలో అధికారులు నిర్లక్ష్య దోరణి ప్రదర్శిస్తున్నారని రైతులు మొత్తుకుంటున్నారు. ఇటీవల కార్యానిర్వాహక ఇంజనీర్ కార్యాలయం ఎదుట రైతులు ఆందోళన కూడా చేశారు. కాలువల నిర్వహణ సరిలేక పొలాలు ముంపుకు గురౌతున్నాయని ధ్వజమెత్తిన సంగతి తెలిసిందే.

వేధిస్తున్న సిబ్బంది కొరత..

జలవనరుల శాఖలో లస్కర్ల పాత్ర ఎంతో కీలకమైంది. వీరు లాకుల వద్ద నీటి నియంత్రణలో ఉంటారు. అవసరమైనపుడు నీటి విడుదల, అవసరం లేనపుడు నీటిని పొదుపుచేయటం వీరి పని. అలాగే భారీ వర్షాలు, వరదలు సంభవించినపుడు ఏ ప్రాంతంలో ముంపుకు గురౌతాయి, ఎక్కడ నీటిని మళ్ళించాలన్నది వీరికి ఓ అంచనా ఉంటుంది. ఒక్క మాటల్లో చెప్పాలంటే నీటిపారుదల వ్యవస్థలకు ఆయువుపట్టే లస్కర్లు. కృష్ణా వెస్టన్ డెల్టా ఆయకట్టు సామర్ధ్యానికి తగిన నిష్పత్తిలో లస్కర్లు లేరు. వాస్తవానికి వెస్టన్ డెల్టా పరిధిలో 210 మంది లస్కర్లు ఉండాలి. అయితే ప్రస్తుతం రెగ్యులర్ ప్రాతిపదికన కేవలం 42 మంది మాత్రమే ఉన్నారు. 5.71లక్షల ఎకరాల సాగు విస్తీర్ణానికి వీరి సామర్ధ్యం చాలదు. తప్పని పరిస్థితుల్లో సాగునీటి విడుదల సమయంలో తాత్కాలికంగా నెలకు రూ.10వేల వేతనంపై లస్కర్లను నియమిస్తున్నారు. వారికి నెలవారి వేతనాలు చెల్లింపులోనూ జాప్యమే. దాదాపు ఏడాది దాటాల్సిందే. దీంతో వారు కూడా అనాసక్తిగానే పనిచేస్తున్నారు. ఇలాంటి పరిణామాలతో నీటి పారుదల వ్యవస్తే నిర్వీర్యమైపోతుందన్న ఆరోపణలు మెండుగా ఉన్నాయి.

మరమ్మతులకు నోచుకోని లాకులు

ఇదిలా ఉంటే నీటి నియంత్రణలో ప్రధాన భూమిక పోషించే లాకుల పరిస్థితి కూడా దయనీయంగా ఉంది. తుప్పు డోర్లు తుప్పు పట్టిపోయి శిధిలావస్థకు చేరాయి. వాటిని దన్నుగా ఉండే ఐరన్ ఫ్రేమ్‌లు కూడా దెబ్బతిన్నాయి. దీంతో చెక్క దుంగలను అడ్డుపెడుతున్నారు. ముఖ్యంగా దుగ్గిరాల లాకులు కృష్ణా వెస్టన్ డెల్టాలో తూర్పు, పడమర, నిజాంపట్నం కాలువలతో పాటు కొమ్మమూరు కెనాల్‌కు నీటి యాజమాన్యంలో కీలకం. అలాంటి దుగ్గిరాల లాకుల పరిస్థితే దయనీయంగా ఉంది. లాకు మూసివేసినా పగిలిపోయిన రేకు తలుపుల నుంచి నీరు పోతూనే ఉంది. దీనికి తోడు కొల్లిపర మండలం పిడపర్రు లాకుల పరిస్థితి కూడా అంతే. ఇవి రెండూ మచ్చుకు మాత్రమే. ఇటీవల రైతు సంఘం నాయకులు, పట్టణ పరిసర ప్రాంత అభివృద్ధి సంఘం నాయకులు లాకులను పరిశీలించి, మరమ్మతులకు చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు కూడా.

> **లస్కర్ వ్యవస్థ నిర్వీర్యం**
>
> **నీటిపారుదల వ్యవస్థలకు ఆయువుపట్టే లస్కర్లు. కృష్ణా వెస్టన్ డెల్టా ఆయకట్టు సామర్ధ్యానికి తగిన నిష్పత్తిలో లస్కర్లు లేరు. వాస్తవానికి వెస్టన్ డెల్టా పరిధిలో 210 మంది లస్కర్లు ఉండాలి. అయితే ప్రస్తుతం రెగ్యులర్ ప్రాతిపదికన కేవలం 42 మంది మాత్రమే ఉన్నారు. 5.71లక్షల ఎకరాల సాగు విస్తీర్ణానికి వీరి సామర్ధ్యం చాలదు.**

ఆధునీకరణ ప్రణాళికే లేదు..

ఇదిలా ఉంటే కృష్ణా వెస్టన్ డెల్టా ఆధునీకరణకు ఓ ప్రణాళిక లేదు. వాస్తవానికి ప్రతి ఏటా ఫిబ్రవరి, మార్చి నెలల్లో కాలువల మరమ్మతులకు అంచనాలు సిద్ధం చేయాలి. వాటికి టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి ఏప్రిల్, మే నెలాఖరుకు కాలువలను నీటి పారుదలకు అనుగుణంగా సిద్ధం చేయాలి. అయితే ఈ తరహా ప్రణాళిక శాఖా పరంగా కరువైందన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఏదైనా రైతులు, రైతు సంఘాలు పెద్దఎత్తున ఆందోళన చేస్తే మినహా స్పందించే పరిస్థితి లేదు. దీనికి తోడు గతంలో పనిచేసిన కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లింపు లేదు. కోట్లాది




జగ్గడిగుంటపాలెంలో పూడిక తీయని సాగునీటి కాలువ


రూపాయలు పెండింగ్‌లో ఉన్నాయి. దీంతో ఏ పనికి టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు ముందుకు వచ్చే పరిస్థితి లేదు. ఆధునీకరణ పనులకు 2017-18 నుంచి బిల్లులు పెండింగే. ఆరు ప్యాకేజీల్లో దాదాపు రూ.50కోట్ల వరకూ బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్లు సమాచారం.

ఇరిగేషన్ డ్రెయినేజ్ వ్యవస్థలపై నిర్లక్ష్యం

ములకా శివసాంబిరెడ్డి, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు



ఇరిగేషన్, డ్రెనేజ్ వ్యవస్థలపై ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తుంది చిన్నచిన్న పనులకు కూడా నిధులు లేవంటూ అధికారులు చెబుతున్నారు. గతంలో ఎకరానికి రూ.200 చొప్పున రెవెన్యూ అధికారులు నీటి తీరుగా వసూలు చేసి, దానిలో కొంత భాగాన్ని డ్రెనేజ్ ఇరిగేషన్ శాఖలకు పంపేవారు. ప్రస్తుతం నీటి తీరువా వసూళ్లు కూడా లేవు. సర్వర్లు పనిచేయడం లేనిదని అధికారులు చెబుతున్నారు. లాకులు పూర్తిగా దెబ్బతిన్నాయి. పిడపర్రు లాకుల మరమ్మతులకు నిధులు మంజూరు చేశామని నాలుగు నెలల క్రితం అధికారులు చెప్పినా ఎలాంటి చర్యలు చేపట్టలేదు. ప్రమాదవశాత్తూ కట్టలు తెగితే వేల ఎకరాలలో పంటలు నీటి పాలవుతుంది. రైతులు తీవ్రంగా నష్టపోతారు. దీనికి తోడు లస్కర్లు సరిపడా లేకపోవడంతో లాకుల పర్యవేక్షణ కూడా కరువైంది. ఈ పరిస్థితులను ప్రభుత్వం చక్కదిద్దాలి.



ఎమ్మెల్యే ముస్తఫాకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు, కార్మికులు

నిర్మాణ కార్మికులకు న్యాయం చేయాలని వినతి

ప్రజాశక్తి-గుంటూరు

వైసిపి ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికులకు తీవ్ర అన్యాయం చేస్తుందని గుంటూరు జిల్లా భవన, ఇతర నిర్మాణ కార్మిక సంఘం(సిఐటియు) జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నారు. భవన నిర్మాణ సంక్షేమ బోర్డు నిధులు కార్మికులకు కాకుండా ఇతర అవసరాలకు ఖర్చు చేస్తున్నారని, కార్మికులకు సంక్షేమ పథకాలు వెంటనే అమలు చేయాలని కోరారు. ఈమేరకు గుంటూరు తూర్పు నియోజక వర్గ ఎమ్మెల్యే ముస్తఫాకు యూనియన్ నాయకులు గురువారం వినతిపత్రం అందజేశారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును కొనసాగించాలని, పెండింగ్‌లో ఉన్న క్లైములు వెంటనే విడుదల చేయాలని, వైఎస్సార్ బీమా పథకం కుటుంబ సభ్యులందరికీ వర్తింప చేయాలని ప్రభుత్వానికి తెలియజేయాలని కోరారు. ఈ సందర్భంగా ముస్తఫా స్పందిస్తూ భవన నిర్మాణ కార్మికుల సమస్యలను ముఖ్యమంత్రి దష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. తొలుత యూనియన్ నాయకులు, కార్మికులు మంగళదాస్ నగర్ మెయిన్ రోడ్డు నుండి ర్యాలీగా వెళ్లి వినతి పత్రం అందజేశారు.కార్యక్రమంలో యూనియన్ నగర గౌరవ అధ్యక్షులు కె.శ్రీనివాసరావు, సిఐటియు పశ్చిమ కమిటీ అధ్యక్షులు బి.సత్యనారాయణ, భవన నిర్మాణ కార్మిక సంఘం పశ్చిమ కమిటీ ప్రధాన కార్యదర్శి ఎస్కే ఖాసింవలి, తూర్పు కమిటీ అధ్యక్షులు పి.దీవెనరావు, సీతయ్య, తాడిబోయిన శ్రీనివాసరావు, మైలా ముత్యాలరావు, ఖాజా ఖాన్, నక్కమస్తాన్, సారథి, భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

25న కార్మిక సంఘాల జిల్లా సదస్సు

ప్రజాశక్తి-గుంటూరు

కార్మికుల సమస్యలపై ఈనెల 25న పాతగుంటూరు సిఐటియు కార్యాలయంలో నిర్వహిస్తున్న జిల్లా సదస్సును, ఆగస్టు 9న క్విట్ ఇండియా డే సందర్భంగా విజయవాడలో జరిగే మహాధర్నాను జయప్రదం చేయాలని అఖిల భారత కార్మిక సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. గురువారం కొత్తపేట మలయలింగం భవన్‌లో కార్మిక సంఘాల సమావేశం సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి హనుమంతరావు, సిఐటియు జిల్లా అధ్యక్షులు దండా లక్ష్మీనారాయణ, ఐఎఫ్‌టియు జిల్లా నాయకులు ఎన్.వి.కృష్ణ మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వ విధానాల వలన కార్మికులు, కర్షకులు ఇతర వర్గాల ప్రజలు పెద్ద ఎత్తున నష్టపోతున్నారని అన్నారు. 9 ఏళ్ల కాలంలో ఆర్థిక సంస్కరణలు, కార్మిక సంస్కరణల పేరుతో కార్మిక వర్గాన్ని దోపిడీ చేస్తున్నారన్నారు. ఈ విధానాలు ఇలాగే కొనసాగితే భవిష్యత్తులో కేంద్ర కార్మిక సంఘాలన్నీ పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు ఎ.అరుణ్ కుమార్, జి.వి.నరేష్, పుప్పాల సత్య నారాయణ ఐఎఫ్‌టియు నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎఐటియుసి జిల్లా కార్యదర్శి హనుమంతరావు

కాజ గ్రామానికి విశేష సేవలు

సిపిఎం అభిమాని భూనం సరోజిని సంస్మరణ సభలో వక్తలు

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

కాజ గ్రామంలో సిపిఎం అభివృద్ధికి, స్థానిక సమస్యల పరిష్కారానికి భూనం సరోజిని విశేష కృషి చేశారని సిపిఎం సీనియర్ నాయకులు జెవి రాఘవులు తెలిపారు. సిపిఎం సానుభూతిపరురాలు భూనం సరోజిని సంస్మరణ సభ గురువారం కాజా గ్రామంలో సీపీఎం నాయకులు ఆర్దల సాంబశివరావు అధ్యక్షతన జరిగింది. సభలో జెవి రాఘవులు మాట్లాడుతూ భూనం సరోజినీ సిపిఎం తరపున గ్రామ వార్డు మెంబర్ గా ఎన్నిక అయ్యి స్థానిక సమస్యల ను పరిష్కరించేందుకు పోరాడారన్నారు. వారి కుటుంబ సభ్యులైన భూనం రాఘవయ్య సర్పంచ్‌గా ఉన్న క్రమంలో నిజాయితీగా నిలిచారని అటువంటి కుటుంబం ప్రజలకోసం నిరంతరం సేవలు అందించడం ఆదర్శనీయమన్నారు. కుటుంబాన్ని పార్టీ వైపు నడిపించడానికి సరోజిని ఎల్లప్పుడు సహాయ సహకారాలు అందిస్తూనే వచ్చారన్నారు. ఇటువంటి వారిని ఆదర్శంగా తీసుకొని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు బి కోటేశ్వరి, తమ్మ ప్రసాద్ రెడ్డి, ఎస్ఎఫ్ఐ నాయకులు బాలాజీ, డివైఎఫ్ఐ నాయకులు గణేష్, ఆళ్ల సాంబి రెడ్డి తది తరులు పాల్గొన్నారు. తొలుత సరోజిని చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.



నిస్సహాయులకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - మంగళగిరి



విజయ హెల్త్ కేర్ ట్రస్ట్ మరియు బీసీ సంక్షేమ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో రేవేంద్రపాడుకు చెందిన ఇరువురు నిస్సహాయులకు నెలకు సరిపడా నిత్యవసరాలు, ట్రై సైకిల్ పంపిణీ గురువారం నిర్వహించారు. ట్రై సైకిల్‌కి ఆర్థిక సహాయం మంగళగిరి చెందిన వెనిగళ్ళ సతీష్ చేశారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ ప్రతినెల నిత్యవసర సరుకులను వాళ్లకు అందిస్తామని తెలిపారు. కుటుంబాన్ని కూడా దత్తత తీసుకున్నామని అన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు పారేపల్లి మహేష్ , విజయ హెల్త్ కేర్ ట్రస్ట్ ఫౌండర్ కాగితాల స్వాతి గౌడ్, అలా శివాజీ ,తిరువీధుల కిరణ్, ఉడత శ్రీనివాస్, మాదు నాగ దుర్గ, మాదువెంకటేశ్వరరావు రాజేశ్వరి, సునీత, నాగబాబు మహేష్ తదితరులు పాల్గొన్నారు.



ఎంపికైన వారిని సత్కరిస్తున్న ఉపాధ్యాయులు, కౌన్సిలర్లు

ట్రిపుల్ ఐటిలో పలువురికి సీట్లు

ప్రజాశక్తి - చిలకలూరిపేట

పట్టణ పరిధిలో పసుమర్రులో ఉన్న శ్రీ మద్ది కామయ్య జెడ్పి పాఠశాల విద్యార్థినులు ట్రిపుల్ ఐటిలో సీట్లు సాధించారని హెచ్ఎం వై.హనుమంతరావు గురువారం తెలిపారు. నూజివీడు ట్రిబుల్ ఐటీకి తన్నీరు హిమబిందు, ఒంగోలు ట్రిపుల్ ఐటీకి పెట్లూరి రూపాంజలి ఎంపికైనట్లు చెప్పారు. వీరిని తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ ఎర్రం వెంకటసుబ్బయ్య, 15, 16 వార్డుల కౌన్సిలర్లు జాలాది సుబ్బారావు, షేక్ మస్తాన్‌వలి, పూర్వ విద్యార్థి సంఘ నాయకులు గద్దె వెంకట హరిబాబు, ఉపాధ్యాయులు అభినందించారు.





మండల పరిధిలోని కావూరు జెడ్పి పాఠశాలకు చెందిన వింజమూరు శ్రీలక్ష్మి, దొంతల నాగలక్ష్మి ఒంగోలు ట్రిపుల్ ఐటిలో సీట్లు సాధించినట్లు హెచ్ఎం ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. ఎంపికైన వారిని ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినదించారు.

ప్రజాశక్తి–పెదకూరపాడు





పెదకూరపాడు కాకతీయ హైస్కూల్‌కు చెందిన అవ్వారి జ్ఞానశ్రీ, త్యాళ్ళూరు జెడ్పి పాఠశాల విద్యార్థి అన్నపురెడ్డి ప్రవీణ్ కుమార్‌రెడ్డి ట్రిపుల్ ఐటి సీట్లు సాధించినట్లు నిర్వాహకులు సాంబశివరావు, హెచ్ఎం శ్రీనివాస్‌రెడ్డి గురువారం తెలిపారు. ఎంపికైన వారిని ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

ప్రజాశక్తి–ఈపూరు

మండలంలో నలుగురు జెడ్పి విద్యార్థులు ట్రిపుల్ ఐటి సీట్లు సాధించినట్లు ఎంఇఒ–2 రామ తులసి గురువారం తెలిపారు. ఈపూరు జెడ్పి పాఠశాల విద్యార్థిని మేడికొండ గ్రేస్ ఒంగోలు ట్రిపుల్ ఐటిలో, ఇనిమెళ్ల జెడ్పి విద్యార్థిని షేక్ సలీమా నూజివీడు ట్రిపుల్ ఐటి, పాలెపోగు యోగి ఒంగోలు ట్రిపుల్ ఐటిలో, బొగ్గరం జెడ్పి విద్యార్థిని మందాడి భాను ఒంగోలు ట్రిపుల్ ఐటిలో సీట్లు సాధించినట్లు వివరించారు.

ఓటరు జాబితాపై 21 నుంచి ఇంటింటి సర్వే

ప్రజాశక్తి - రెంటచింతల

ఓటరు జాబితాపై ఈ నెల 21 నుంచి డోర్ టు డోర్ సర్వేకు ప్రణాళికలు రూపొందించినట్లు తహశీల్దార్ కె.పుల్లారావు గురువారం తెలిపారు. ఇంటింటికీ వెళ్లి ఓటు కార్డుకు ఆధార్ అనుసంధానం అయ్యిందా? లేదా? పరిశీలించి నమోదు చేయాల్సిన బాధ్యత బిఎల్‌ఒలదేనని స్పష్టం చేశారు. భవిష్యత్తులో ఈ–ఓటర్ జాబితాపై ఎటువంటి తప్పిదాలు జరిగిన బిఎల్‌ఒలే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. రెండ్రోజుల్లో బూత్ స్థాయి సిబ్బందికి శిక్షణిస్తామన్నారు. మృతి చెందిన, ఇతర ప్రాంతాల్లో ఉండే వారి పేర్లను ఓటర్ల జాబితాలో కచ్చితంగా తొలగిస్తామన్నారు. మండలంలో 50 పోలింగ్ బూతులు, 50 మంది బిఎల్వోలు ఉన్నారన్నారు.


టిడిపి నాయకులు లక్ష్మయ్య మృతి

ప్రజాశక్తి - బెల్లంకొండ : మండలంలోని మన్నె సుల్తాన్ పాలేనికి చెందిన టిడిపి సీనియర్ నాయకులు ఏపూరి లక్ష్మయ్య (60) అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన భౌతికకాయాన్ని టిడిపి మైనార్టీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిఎస్‌కె మస్తాన్ షరీఫ్ సందర్శించి నివాళులర్పించారు. బెల్లంకొండ సొసైటీ వైస్ ప్రెసిడెంట్‌గా పని చేసిన ఆయన పార్టీ అభివృద్ధికి దోహదపడ్డారని చెప్పారు. మృతుని కుటుంబానికి రూ.5 వేలు అందించారు. కార్యక్రమంలో నాయకులు వి.వెంకటేశ్వర్లు, జి.కొండయ్య, ఎన్.హుస్సేన్, ఎన్.పిచ్చయ్య, ఎస్.అబ్దుల్ జబ్బర్, రసూల్, జిలాని, శివ, ఏసుపాదం పాల్గొన్నారు.

అమ్మఒడి కోసం నిరీక్షణ

ప్రజాశక్తి - చిలకలూరిపేట

బ్యాంకు ఖాతాలకు ఫోన్ నంబర్ అనుసంధానమైన వారు తరచూ ఫోన్లో మెజేస్‌లు చెక్ చేసుకోవడం.. అనుసంధానం కానివారు వీలున్నప్పుడల్లా బ్యాంకులకు వెళ్లి బ్యాలెన్స్ ఎంతో కనుక్కోవడం. నియోజకవర్గంలోని అమ్మఒడి లబ్ధిదారుల్లో దాదాపు 25–35 శాతం మంది పరిస్థితి ఇదే. గతనెల 16వ తేదీన పార్వతిపురం జిల్లాలో నాలుగో విడత అమ్మఒడి జమను సిఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించారు. అయితే ఇప్పటి వరకు అనేక మందికి నగదు జమ కాకపోవడం, అందుకు కారణాలు తెలియకపోవడంతో సచివాలయాలు, అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. వారి నుండి సంతృప్తి కరమైన సమాధానం రాకపోగా అసలు వస్తుందో లేదో కూడా సమాచారం లేదని అంటున్నారు. గతంలో సమాచారం మొత్తం మండల విద్యాధికారి వద్దకు వచ్చేది. ఇప్పుడు వార్డు సచివాలయాలకు నేరుగా పంపుతున్నారు. నిధులు జమవ్వని నేపథ్యంలో తాము అప్పులు చేసి ఫీజులు కడుతున్నామని ప్రైవేటు పాఠశాలల పిల్లల తల్లిదండ్రులు చెబుతుండగా పనులు మానుకుని మరీ బ్యాంకుల, కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నామని ఇతరులు చెబుతున్నారు. తమ పిల్లల హాజరు సరిగా లేని కారణంగా అనర్హత పొందామా? అని అంటే అదీ కాదని, హాజరుశాతం బాగానే ఉందని అంటున్నారు. అర్హుల జాబితాలో తమ పేర్లున్నా నగదు జమ కాకపోవడంతో సాంకేతిక సమస్యలేమైనా ఉండి ఉండొచ్చని, బ్యాంక్ ఖాతాలకు ఆధార్ అనుసంధానం కానివారు పోస్టాఫీసులో ఖాతాలు తెరవాలని సిబ్బంది చెబుతున్నారు.



సచివాలయం నోటీసు బోర్డులో లబ్ధిదారుల జాబితా

బిజెపితో వైసిపి లోపాయకారి ఒప్పందం

శాసన మండలి మాజీ చైర్మన్ మొహమ్మద్ షరీఫ్

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా



సమావేశంలో మొహమ్మద్ షరీఫ్, వేదికపై జీవీ ఆంజనేయులు, ఇతర నాయకులు

బిజెపితో జగన్‌మోహన్‌రెడ్డి లోపాయకారిగా ఒప్పందం చేసుకుని బయటకు మాత్రం బిజెపి–టిడిపి మళ్లీ కలుస్తున్నాయంటూ తప్పుడు ప్రచారం చెపిస్తున్నారని శాసన మండలి మాజీ చైర్మన్, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు మొహమ్మద్ షరీఫ్ విమర్శించారు. పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేటలోని ఒ ఫంక్షన్ హాల్‌లో పల్నాడు జిల్లా ముస్లిమ్ మైనారిటీల ఆత్మీయ సమావేశం గురువారం జరిగింది. కార్యక్రమానికి జిల్లా మైనారిటీ అధ్యక్షులు సయ్యద్ అమీర్ అలీ అధ్యక్షత వహించగా షరీఫ్ మాట్లాడుతూ పేరుకే వైసీపీ ప్రభుత్వం ముస్లింలకు బడ్జెట్ లో డబ్బులు కేటాయిస్తున్నారని, కొత్త మసీదులకు సున్నం వేయడానికి కూడా వైసీపీ నేతలకు మనస్సు రావడం లేదన్నారు. ఉర్దూ అకాడమీకి జగన్ మోహన్ రెడ్డి ఒక్క పైసా ఖర్చు చేయలేదని, చివరికి వక్ఫ్ బోర్డు ఆస్తులను సైతం వైసీపీ నేతలు ఆక్రమించుకున్నారన్నారు. టిడిపి పల్నాడు జిల్లా అధ్యక్షులు జివి ఆంజనేయులు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం వచ్చిన తరువాత మాచర్ల, గురజాలలో ముస్లిములపై దాడులు జరిగాయన్నారు. గురజాలలో ముస్లిం వ్యక్తిని వైసిపికి చెందిన నాయకులు నడిరోడ్డు పై కత్తులతో నరికారని మండిపడ్డారు. రాష్ట్ర ముస్లిం మైనారిటీ అధ్యక్షుడు ముస్తాక్ అహమ్మద్ మాట్లాడుతూ మాచర్లలో ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి దౌర్జన్యాలకు అంతులేదని, నరసరావుపేటలో మతపెద్ద ఇబ్రహీంను ఎమ్మెల్యే శ్రీనివాసరెడ్డి అనుచరులు నడిరోడ్డు పై నరికి చంపారని అన్నారు. దాడులపై కేసులు పెట్టనివ్వడం లేదని విమర్శించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి పత్తిపాటి పుల్లారావు, మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాస్, నరసరావుపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబు టిడిపి రాష్ట్ర కార్యదర్శి నల్లపాటి రామచంద్రప్రసాద్ తదితరులు మాట్లాడారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

ప్రజాశక్తి - బెల్లంకొండ



రసాయనాలు విచ్చల విడిగా వాడటం వలన భూసారం దెబ్బతిని పంట దిగుబడులు తగ్గుతున్నాయని పల్నాడు ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కె.అమల కుమారి అన్నారు. ప్రకృతి వ్యవసాయం సాగు విధానంపై మండలంలోని నాగిరెడ్డిపాలెం రైతు భరోసా కేంద్రంలో గురువారం అవగాహన కల్పించారు. రసాయనాలు లేకుండా సహజ సిద్ధమైన ఎరువులతో పంటలు పండిస్తే లాభమన్నారు. ఇంటి పరిసరాల్లో ఖాళీగా ఉన్న రెండు లేదా మూడు సెంట్లలో సూర్య మండలం మోడల్ విధానంలో పలు రకాలైన ఆకుకూరలు, పండ్లు, దుంపజాతి, తీగ జాతి, కూరగాయలను ప్రకృతి వ్యవసాయ విధానంలో పండించి నెలకు రూ.3 వేల ఆదాయం పొందొచ్చని వివరించారు. గ్రామంలోని కె.జ్యోతి సాగు చేస్తున్న విధానాన్ని పరిశీలించారు. రైతులకు 30 రకాల పిఎండిఎస్ కిట్లు, ఎస్‌టుఎస్ కిట్లను అందించారు. కార్యక్రమంలో జిల్లా అడిషనల్ డిపిఎం ప్రేమ్‌రాజు, ఎపిఎం ఉషశ్రీ, డిటి ఎపిఎం శివకుమార్, నాగమల్లేశ్వరి, సతీష్, సంధ్య, అనంతలక్ష్మి పాల్గొన్నారు.

కాలుష్య నియంత్రణ చర్యలకు సమగ్ర ప్రణాళిక

ప్రజాశక్తి- పల్నాడు జిల్లా

జిల్లాలో కాలుష్య నియంత్రణకు సమగ్ర ప్రణాళికను రూపొందించాలని సంబంధిత అధికారులను పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో గురువారం జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. పెరుగుతున్న జనాభా అవసరాలకు అనుగుణంగా కాలుష్య నియంత్రణ చర్యలను అడిగి తెలుసుకున్నారు. సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ విధానం, పబ్లిక్ హెల్త్ వర్కర్స్, చెత్త తరలింపు విధానం, ప్లాస్టిక్ నియంత్రణ, రక్షితమైన వాతావరణం, మైనింగ్ నుంచి గాలి ద్వారా వెలువడే దుమ్ము, ధూళి, నిరుపయోగ సామగ్రి, డంపింగ్ యార్డులు, కాలుష్యంతో కూడిన నీటి సరఫరా, ప్రకృతిని దెబ్బతీసే అంశాలపై జిల్లా కలెక్టర్ చర్చించారు. అందుబాటులో ఉన్న వనరులను వినియోగించుకొని, వ్యర్థాలను నియంత్రిస్తూ, వృథా అయ్యే వాటిని కాపాడి, మేలు చేసే పనులు చేయాలన్నారు. వచ్చే సమావేశం నాటికి పూర్తిస్థాయి ప్రణాళికతో నివేదికలను సిద్ధం చేయాలని ఆదేశించారు. సమావేశంలో కాలుష్య నియంత్రణ మండలి అధికారి నారాయణ, మైనింగ్, జియాలజీ అధికారి, అంతర్గత నీటి సరఫరా డిప్యూటీ డైరెక్టర్, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో నేడు నవోదయం

నరసరావుపేట కలెక్టరేట్ ప్రాంగణంలో నవోదయం కార్యక్రమం శుక్రవారం జరుగుతుందని కలెక్టర్ కార్యాలయం గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. జిల్లా వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ సామాజిక తరగతుల వారికోసం నిర్వహించే ఈ కార్యక్రమంలో ప్రధానంగా విద్య, ఉద్యోగం, ఉపాధి, వ్యాపారం, యువ సాధికారిత అంశాల ఆధారంగా నిర్వహిస్తామని పేర్కొంది. ఉదయం 10 గంటల నుండి జరిగే కార్యక్రమానికి సంబంధిత శాఖల విద్య, ఉద్యోగ, ఉపాధి, పరిశ్రమల శాఖ అధికారులు, బ్యాంకర్లు హాజరవుతారని, లక్షిత ప్రజలు సద్వినియోగం చేసుకోవాని కార్యాలయంలో ఆ ప్రకటనలో పేర్కొంది.

గృహ నిర్మాణాలను సత్వరం పూర్తి చేయాలి : జెసి



సమీక్షలో మాట్లాడుతున్న జెసి శ్యామ్‌ప్రసాద్

పట్టణ ప్రాంత జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని అధికారులను పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ఆదేశించారు. దీనిపై కలెక్టరేట్‌లోని ఎస్ ఆర్ శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో గురువారం సమీక్షించారు. వీటితో పాటు వెనుకబడిన మండల అధికారుల టీమ్, మున్సిపల్ కమిషనర్లు, గహ నిర్మాణ శాఖ అధికారులు, ఇతర శాఖల అధికారులతో మాట్లాడారు. ఆప్షన్–2, ఆప్షన్–3 ద్వారా ఇళ్ల నిర్మాణాల పనులు జరుగుతున్న విధానాలను అడిగి తెలుసుకున్నారు. ఎక్కడ ఇబ్బందులున్నా ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాలని చెప్పారు. క్షేత్ర స్థాయికి వెళ్లి లబ్ధిదారులతో మాట్లాడి ఇళ్లు కట్టుకునేలా ప్రోత్సహించాలని చెప్పారు. మౌలిక వసతులు, తాగునీరు, విద్యుత్, రహదార్లు వేయడం వల్ల నష్టపోతున్న లబ్ధిదారులను గుర్తించి వారికి ప్రత్యామ్నాయ స్థలాలు, నష్టపరిహారం ఇస్తామని చెప్పారు. వారి వివరాలను నివేదిక రూపంలో కలెక్టరేట్ పంపాలన్నారు. జిల్లాలో జగనన్న కాలనీలకు ముందు ఆర్చీల నిర్మాణ పనులను సకాలంలో పూర్తి చేయాలన్నారు. జగనన్న కాలనీల్లో త్వరిత గతిన విద్యుత్తు కనెక్షన్ కోసం తప్పని సరిగా లబ్ధిదారులను సచివాలయం ఉద్యోగులను సమన్వయ పరచుకొని పని చేయాలని సూచించారు.

వ్యర్థాల కేంద్రంగా లే అవుట్

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్



నివాస యోగ్యంగా లేనిచోట జగనన్న లే అవుట్ వేసి పేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేశారు. మండలంలోని పెదమక్కెనలో సర్వే నంబర్ 177 గ్రామ కంఠంలో జగనన్న లేఅవుట్‌ను ఏర్పాటు చేశారు. గ్రామానికి దక్షిణాన జగనన్న కాలనీలో 56 మందికి స్థలాలిచ్చారు. సుమారు 1.5 కిలోమీటర్ల దూరంలో ఇళ్ల స్థలాలు ఇవ్వటంతో లబ్ధిదారులు ఇళ్ళు నిర్మించుకునేందుకు ఆసక్తి చూపటం లేదు. సమీపంలో వాగు వుండటంతో ఎవరూ వెళ్ళటం లేదు. లేఅవుట్‌లో వ్యర్థాలు పడవేస్తున్నారు. గ్రామానికి దగ్గరగా స్థలాలివ్వాలని లబ్ధిదార్లు కోరుతున్నారు.

విలీనంతో చెల్లాచెదురు



పాఠశాలకు స్థలాన్ని బహుకరించిన దాత శిలాఫలకం

స్థలదాతలూ ఆవేదన

విద్యార్థులు లేని బడులకు ఉపాధ్యాయులు
విధుల్లేని బడులకు రూ.12లక్షల నిధులు




పాఠశాల అభివృద్ధికి చ ందాదారుల శిలా ఫలకం

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

60 మంది విద్యార్థులతో స్థలదాతలు, గ్రామస్తుల వితరణతో విలసిల్లిన విద్యాలయం నేడు విలీనంతో చెల్లాచెదురయ్యింది. బలహీనవర్గాల విద్యార్థులకు విద్యనందించేందుకు ఏర్పాటు చేసిన పాఠశాలలో నేడు విద్యార్థులు లేక కునారిల్లుతుంది.

పెదగొట్టిపాడు ఎంపిపిఎస్‌టిఎస్ పాఠశాలలో ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ విద్యార్థులు 60 మందితో నాడు కళకళలాడిన పాఠశాల నేడు ముగ్గురు విద్యార్థులు, ఒక ఉపాధ్యాయుడితో కొనసాగుతుంది. విలీనంతో విద్యార్థులు చెల్లాచెదురయ్యారు. పేద పిల్లల విద్య కోసం గ్రామానికి చెందిన గుంటుపల్లి రామచంద్రాయ జ్ఞాన ప్రసూనాంబ జ్ఞాపకార్థంగా వారి కుమారుడు గుంటుపల్లి విజయ సారథి పాఠశాలకు స్థలాన్ని ఉచితంగా ఇచ్చారు. విద్యార్థులు లేకుండా పాఠశాల కునారిల్లుతుందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలోని తల్లిదండ్రులు కొంత నగదును సమకూర్చుకుని పాఠశాలలో మౌలిక వసతులు ఏర్పాటు చేసుకున్నారు. 60 మంది విద్యార్థులతో కొనసాగుతున్న పాఠశాల విలీనం పేరుతో చెల్లాచెదురయ్యిందని గ్రామస్తులు వాపోతున్నారు. విలీనం ప్రక్రియ వలన ఆ పాఠశాలలోని మూడు నాలుగు ఐదు తరగతుల విద్యార్థులు వెళ్లిపోగా, ఒకటవ క్లాసు ఒకరు, రెండో క్లాసు ఇద్దరు మొత్తం ముగ్గురు విద్యార్థులు మాత్రమే ఉన్నారు. ఈ పాఠశాలకు నాడు నేడు కింద రూ.12లక్షలు కేటాయించి పనులు నిర్వహిస్తున్నారు.

గ్రామంలోని పెద్దలు, స్థల దాతలు మరియు విరాళాలు ఇచ్చినవారు గ్రామంలోని విద్యార్థులు చదువుకొని ఉన్న స్థాయిలో ఉంటారని ప్రతిదానికి చదివే అవసరమని, అలాంటి చదువుని అందరికీ అందించే విధంగా చేయాలని ఉద్దేశంతో స్థలము మరియు విరాళాలు ఇచ్చామని ఇప్పుడు ఆ పాఠశాలలో విలీనం పేరుతో విద్యార్థులు లేకుండా చేసి విద్యార్థులు లేని పాఠశాలకు నాడు నేడు పనుల పేరిట ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని వారు ఆరోపిస్తున్నారు.

విద్యార్థులు లేని బడికి ఉపాధ్యాయుడు: మండలంలోని నిమ్మగడ్డ వారి పాలెం గ్రామంలో ఉన్న ఎంపీపీఎస్ పాఠశాలలో విద్యార్థులు లేకుండా ఉపాధ్యాయులను రోజుకి ఒకల్ని డిప్యూటేషన్ పేరిట ఆ పాఠశాలకు పంపిస్తున్నారు. ఆ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయురాలు లీవ్‌లో ఉందని, రోజుకు ఒకరిని కేటాయిస్తున్నారు. అయితే ఆ పాఠశాలలో విద్యార్థులు ఎవరు లేకపోవడం ఉపాధ్యాయులు రోజుకు ఒకల్ని డిప్యూటేషన్ పేరిట ఆ పాఠశాల కేటాయించడం వారు వచ్చి ఉదయం నుండి సాయంత్రం వరకు కూర్చొని వెళ్ళిపోతున్నారు.


ముగ్గురు విద్యార్థులతో ఉపాధ్యాయుడు

దోమల నియంత్రణపై ఎగ్జిబిషన్

సందర్శించిన అసిస్టెంట్ కలెక్టర్ శివనారాయణ శర్మ

ప్రజాశక్తి- తెనాలి

డెంగీ మాసోత్సవాలను పురస్కరించుకొని పట్టణంలోని రావి రవీంద్రనాథ్ నగర్ ట్రైబల్ వెల్ఫేర్ బాలికల రెసిడెన్షియల్ స్కూల్ లో దోమల నియంత్రణ పై ఏర్పాటు చేసిన ప్రదర్శనను గుంటూరు అసిస్టెంట్ కలెక్టర్ శివ నారాయణ శర్మ సందర్శించారు. విద్యార్థులు దోమలకు ఆవాసాలుగా ఉన్న తడి చెత్త పొడి చెత్త, దోమల కొబ్బరి బొండాలు , వాడేసిన చిన్న ప్లాస్టిక్, పేపర్ గ్లాసులు, కూల్ డ్రింక్ బాటిల్స్, దోమ లార్వా ప్రదర్శించారు. దోమ లార్వా తినే గంబూసియా చేపలను కూడా ప్రదర్శించారు. ఈ సందర్భంగా శివ నారాయణ శర్మ మాట్లాడుతూ తడి చెత్త, పొడి చెత్తను వేరు చేయాలని, రీసైక్లింగ్ ద్వారా తిరిగి ఉపయోగించవచ్చన్నారు. ఇంటి ఆవరణలో, చుట్టుపక్కల నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, తద్వారా మలేరియా, డెంగీ వంటి వ్యాధులకు దూరంగా ఉండవచ్చునన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ హెలెన్ నిర్మల, పట్టణ మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ ఎస్. ఉమాకాంత్, పాఠశాల ప్రిన్సిపల్ డాక్టర్ బండి విజయ్ కుమార్, 27, 28 సచివాలయ వార్డు హెల్త్ సెక్రటరీస్ రజిని, సిహెచ్ సునీత, ఆశా కార్యకర్తలు యశోద, నాగలక్ష్మి, సానిటరీ ఇన్స్పెక్టర్ వై లక్ష్మీనారాయణ, సానిటరీ సెక్రెటరీ లక్ష్మీప్రసన్న, పి విజయ రాణి, ఏ చింపిరయ్య, పి వెంకటేశ్వర్లు, మలేరియా సిబ్బంది బి. మల్లేశ్వర రావు, షేక్ రషీద్, షేక్ నవీన్, ఫైలేరియా సీనియర్ ఇన్స్పెక్టర్ రవి, సూపర్వైజర్ ప్రసాద్, రత్నాకర్, భాసిత్ పాల్గొన్నారు .



కెఎల్‌యులో హైటెక్ హ్యాక్‌థాన్

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

వాతావరణంలో వచ్చే మార్పుల గురించి పరిశోధనల గురించి బిటెక్ విద్యార్థులకు జాతీయ స్థాయి హైటెక్ హ్యాక్ థాన్ పేరుతో నిర్వహించే పోటీలకు విద్యార్థులు ఈ నెల30 లోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కెఎల్ డీమ్డ్ యూనివర్శిటీ ఇసిఇ విబాగాధిపతి డాక్టర్ ఎం.సుమన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వర్శిటీలోని న్యూ సెమినార్ హాలులో స్కిల్లింగ్ మరియు ఇసిఇ విబాగాల అధ్వర్యంలో హ్యాక్ థాన్ ను సంయుక్తంగా ప్రకటించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయిన కెఎల్ యు ఇంజనీరింగ్ కళాశాలల ప్రిన్సిపల్ డాక్టర్ టి.కె.రామకష్ణ విధ్యార్థులనుద్దేశించి మాట్లాడారు.ముఖ్యంగా ఇసిఇ విద్యార్థులు వాతావరణంలో జరిగే మార్పులు, ఇసిఇ విబాగంలో పట్టా సాధించిన వారికి ఆర్థిక అభివృద్ధితో పాటు ఉద్యోగ అవకాశాలు. ఉద్యోగ భద్రత వంటి పలు అంశాల గురించి ప్రసంగించారు. ఈ అంశాలపైన పరిశోధన చేసి నమూనా పరిష్కారాలు చేయడంలో అత్యంత ప్రతిభ కనబరిచిన బందాలకు నగదు బహుతులు కూడా ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ వైస్ చాన్సులర్ డాక్టర్ జి.పార్ధసారదివర్మ, ప్రో వైస్ చాన్సులర్ డాక్టర్ ఎవిఎస్.ప్రసాద్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు పాల్గొన్నారు.



విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న ప్రిన్సిపల్

తాగునీటికి రూ.14 కోట్లు మంజూరు

ప్రజాశక్తి - దుగ్గిరాల

మండల పరిధిలోని 18 గ్రామాలకు తాగునీటి కొరత లేకుండా జలజీవన్ మిషన్ పథకం కింద రూ.14 కోట్ల రూపాయలు మంజూరు అయినట్లు మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి తెలిపారు. రెండు రోజుల్లో పనులు ప్రారంభించి 7 -8 నెలలో పూర్తి చేస్తామన్నారు. కేంద్రం రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా 50 శాతం సమాన నిధులు కేటాయించినట్లు తెలిపారు. ఈ మేరకు గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఆర్ డబ్ల్యూ ఎస్ అధికారులతో చర్చలు జరిపారు. లక్ష 20 వేల లీటర్ల నుండి 15వేల లీటర్ల కెపాసిటీ కలిగిన ఓహెచ్ఆర్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు 70 కిలోమీటర్ల పైప్ లైన్ ఏర్పాటు చేనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డబ్ల్యూఎస్ డి ఏ రామకృష్ణ ఏ ఈ నిర్మల త ి ద ి త ి ం ి ు ల ు పాల్గొన్నారు.



కోటేశ్వరరావుకు నివాళి

ప్రజాశక్తి-తాడేపల్లి

ఉండవల్లి టిడిపి గ్రామ మాజీ అధ్యక్షులు కోగంటి కోటేశ్వరరావు (74) గురువారం అనారోగ్యంలో మరణించారు. కోటేశ్వరరావు మృతికి గుంటూరు పార్లమెంట్ టిడిపి ప్రధాన కార్యదర్శి టి.శ్రీనివాసరావు, నందం అబద్దయ్య, అమరా సుబ్బారావు, తాడేపల్లి పట్టణ టిడిపి మాజీ అధ్యక్షులు జంగాల సాంబశివరావు, కొల్లి శేషు, టిడిపి పట్టణ అధ్యక్షులు వల్లభనేని వెంకట్రావు, కళ్లం రాజశేఖరరెడ్డి తదితరులు నివాళు లర్పించారు.

పంట కాల్వల పూడికలు తీయించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి - దుగ్గిరాల

ఇటీవల కురుస్తున్న వర్షాలకు నీటీ ముంపుకు గురైన మండలంలోని మంచికలపూడి గ్రామం రైల్వే గేటు వద్ద ఉన్న పొలాలలో నీటి సమస్య పరిష్కరించేందుకు మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకష్ణారెడ్డి చొరవ తీసుకున్నారు. బుధవారం అధికారులతో చర్చలు జరిపి న అనంతరం గురువారం సొంత నిధులతో ప్రోక్లైన్ తీసుకొచ్చి పంట కాలువల పూడికలు తీయించారు.

ఉపాధి హామీ పనులపై నేడు ప్రజావేదిక

ప్రజాశక్తి- మేడికొండూరు

మేడికొండూరు మండలంలోని 13 గ్రామాలలో జరిగిన, ఉపాధి హామీ పథకం పనులపై శుక్రవారం మండల పరిషత్ కార్యాలయం వద్ద బహిరంగ ప్రజావేదిక జరుగుతుందని ఏపీ ఓ కిరణ్మయి తెలిపారు. 2022- 23 ఆర్థిక సంవత్స రానికి గాను గ్రామాలలో జరిగినటువంటి పనుల సోషల్ ఆడిట్ నివేదిక జరుగు తుందని అన్నారు. ఈ ప్రజా వేదికలో సోషల్ ఆడిట్ బృందాలు పాల్గొంటారని అభ్యంతరాలు ఉన్నవాళ్లు పాల్గొని తమ అభిప్రాయాలు తెలపాలని కోరారు.

పాఠశాల అభివృద్ధికి రూ.5 లక్షలు

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

ప్రత్తిపాడు నీయోజక వర్గం పరిధి లోని వట్టిచెరుకూరు ముట్లూరు లో పునీత శౌరివారి ఉన్నత పాఠశాల అభివృద్ధి కి మాజి క్రికెటర్ అంబటి రాయుడు రూ.5లక్షల రూపాయల చెక్కు ను అందజేశారు. ఇటివల పాఠశాలను సందర్శించిన అంబటి రాయుడు అ పాటశాల అబివృద్దికి సహకరించాలని ఉపాధ్యాయులు కోరారు. ఈ నేపథ్యంలో గురువారం పాఠశాలను సందర్శించి విద్యార్థులతో కొంత సమయం గడిపి రూ.5లక్షల చెక్కుకు అందజేశారు.





రైతుబజార్లో రూ.50కు కిలో టమాటాలు

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి రైతు బజార్లో గురువారం ప్రభుత్వం సబ్సిడీ పై చేస్తున్న కిలో 50 రూపాయలు టమాటాలు పంపిణీ ప్రారంభించారు. ఎస్టేట్ ఆఫీసర్ జి రమేష్ పంపిణీ ప్రారంభించారు. వినియోగదారులు పెద్ద సంఖ్యలో హాజరై బారులు తీరి టమాటాలు కొనుగోలు చేశారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పున్నారావు తదితరులు పాల్గొన్నారు.



క్షయ వ్యాధి పట్ల అవగాహన

ప్రజాశక్తి - మంగళగిరి

క్షయ వ్యాధి పట్ల ప్రజలు అవగాహన కలిగి ఉండాలని జిల్లా క్షయ నివారణ అధికారి బి సుబ్బారావు అన్నారు. గురు వారం మంగళగిరి కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ను ఆయన సందర్శించి మాట్లాడారు. దగ్గు, నీరసం, ఛాతీలో నొప్పి ఉంటే వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి పరీక్ష చేయించు కోవాల న్నారు. హెల్త్ సిబ్బంది ప్రజలకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో డిఎన్‌ఎంఒ డాక్టర్ బి లక్ష్మీ నాయక్, క్షయ నివారణ కోఆర్డినేటర్ రాజశేఖర్, డిపిఎంఓలు జోసెఫ్, బసవయ్య తదితరులు పాల్గొన్నారు.

వడ్డేశ్వరం జడ్పీ హైస్కూల్ విద్యార్థినికి త్రిబుల్ ఐటీలో సీటు

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

ఎం టి ఎం సి పరిధిలోని వడ్డేశ్వరం జిల్లా పరిషత్ హై స్కూల్ లో 2022 - 23 సంవత్సరం పదవ తరగతిలో ద్వితీయ ర్యాంకు, తాడేపల్లి మండలంలోని అత్యధిక మార్కులు సాధించిన అప్పికట్ల ఉదయ నాగలక్ష్మికి నూజివీడు లోని త్రిబుల్ ఐటీ లో సీటు సాధించింది. ఈ సందర్భంగా గురువారం వడ్డేశ్వరం జడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు పలువురు ఉదయ నాగలక్ష్మి కి అభినందనలు తెలిపారు. తమ పాఠశాలలో పదవ తరగతి వరకు చదివిన ఉదయం నాగలక్ష్మి నూజివీడు త్రిబుల్ ఐటీ లో సీటు సాధించడం వడ్డేశ్వరం గ్రామానికి, పాఠశాలకి గర్వకారణం అని పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి సుబ్బారావు, కాకుమాను జోజప్ప అన్నారు. విద్యార్థికి అభినందనలు తెలిపిన వారిలో వ్యాయామ ఉపాధ్యాయులు కే కాంతారావు, కే రామచంద్రరావు, ఎం రామచంద్రారెడ్డి, సుందర్ రాజు, బుజ్జి బాబు, డివి రమణమ్మ, పద్మావతి, తదితరులు ఉన్నారు.


దీక్షల్లో కూర్చున్న రైతులు, నాయకులు

16వ రోజుకు గుంటూరు ఛానల్ దీక్షలు

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు ఛానల్‌ను పర్చూరు వరకూ పొడిగించాలని గుంటూరు కలెక్టరేట్ ఎదుట చేపట్టిన నిరాహార దీక్షలు గురవారంతో 16వ రోజుకు చేరాయి. సంగం డైరీ మాజీ చైర్మన్ కిలారు రాజన్‌బాబు దీక్షా శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలిపారు. గత 15 రోజులుగా రైతులు దీక్షలు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవటం అన్యాయమన్నారు. రైతు నాయకులు అతోట సుబ్బారావు ప్రసంగించారు. దీక్షల్లో నాయుడు సుబ్బారావు, మొవ్వా పెద్దన్న, షేక్ మొహమ్మద్ బాషా, ముప్పలనేని రవి బాబు, యార్లగడ్డ అంకమ్మ చౌదరి, పోపూరి నాగేశ్వర్రావు, కొల్లా రామన్, తదిరులు పాల్గొన్నారు. డాక్టర్ కొల్లా రాజమోహన్, జ్యేష్ఠ వీరయ్య చౌదరి, లావు అంకమ్మ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

ఎపిఎన్ఎస్ఎ అధ్యక్షులుగా డాక్టర్ విజయ

ప్రజాశక్తి-గుంటూరు



లలిత సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, సీనియర్ న్యూరాలజిస్ట్ డాక్టర్ పి.విజయ ఏపీ న్యూరో సైంటిస్ట్ అసోసియేషన్‌కి ఈనెల 9న కర్నూలులో జరిగిన వార్షిక సదస్సులో 2023-24 సంవత్సరానికి అధ్యక్షులుగా ఎన్నికయ్యారు. 1994 ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని న్యూరాలజిస్టులు, న్యూరో సర్జన్లచే ప్రారంభించబడిన అసోసియేషన్‌కు ఆమె 31వ అధ్యక్షులుగా బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఈ అసోసియేషన్‌లో మొత్తం 655 మంది న్యూరోసైంటిస్టులు ఉన్నారు. రాష్ట్రంలో ప్రొఫెషనల్స్‌కు సిఎంఇ, అకడమిక్స్, పబ్లిక్ ఎడ్యుకేషన్, వైద్య విద్యార్థులకు ఎడ్యుకేషన్ యాక్టివిటీలలో న్యూరోసైన్స్ ప్రత్యేకతను ప్రోత్సహించటానికి సీనియర్ల వారసత్వాన్ని తాను కొనసాగిస్తున్నట్లు డాక్టర్ విజయ పేర్కొన్నారు. ఏపిఎన్ఎస్ఎ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఈ సంవత్సరానికి 'బ్రెయిన్ హెల్త్ ఫర్ ఆల్' అనే థీమ్ ఎంపిక చేసిందన్నారు. అన్ని వయస్సుల వారిలో కలిగే వైకల్యానికి నాడీ వ్యవస్థ సంబంధిత రుగ్మతలు ప్రధాన కారణమని, ప్రపంచ వ్యాప్తంగా మరణాలకు రెండవ ప్రధాన కారణమని, దీని వల్ల ప్రతి సంవత్సరం 90 లక్షల మరణాలు సంభవిస్తున్నాయని డాక్టర్ విజయ వివరించారు. ఐదు ముఖ్యమైన నరాల వ్యాధులు బ్రెయిన్ స్ట్రోక్ 42.2 శాతం, మైగ్రేన్ 16.3 శాతం, డిమెన్షియా 10.4 శాతం, మెనింజైటీస్ 7.9శాతం, ఎపిలెప్సీ 4.9శాతం అభివృద్ధి చెందుతున్న దేశాలలో మహిళలు, పిల్లలు ఎక్కువగా ప్రభావితం అవుతున్నారని తెలిపారు. సరైన అవగాహన, జీవనశైలి మార్పులు, రిస్క్ ఫ్యాక్టర్స్ నియంత్రణలో అనేక నరాల సంబంధిత సమస్యలు నివారించబడ తాయని తెలిపారు. రాబోయే సంవత్సరంలో ఎపిఎన్ఎస్ఎ వారు బ్రెయిన్ హెల్త్ ఆవశ్యకతను పిల్లలు, యుక్త వయస్కులు, మధ్య వయస్కులతోపాటు సీనియర్ సిటిజన్లను లక్ష్యంగా చేసుకొని మెదడును ఎలా రక్షించుకోవాలో అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. ఈ లక్ష్యాన్ని సాధించటానికి ప్రభుత్వ సంస్థలు, ఎన్‌జిఒలు, సామాజిక సహాయ బృందాలు, వృత్తిపరమైన సంస్థలతో కలిసి పనిచేయటానికి ఎదురు చూస్తున్నామని డాక్టర్ విజయ చెప్పారు.

వచ్చే నెలలో దూరవిద్య పరీక్షలు

వర్సిటీకి న్యాక్ ర్యాంకు సాధనకు సహకరించాలి : రిజిస్ట్రార్ బి.కరుణ

ప్రజాశక్తి - ఎఎన్‌యు



ఆచార్య నాగార్జున యూనివర్సిటీకి ఉన్నతశ్రేణి న్యాక్ ర్యాంకు సాధనకు సహకరించాలని ఆచార్య నాగార్జున యూనివర్శిటీ రిజిస్ట్రార్ బి కరుణ కోరారు. గురవారం వర్సిటీలో దూరవిద్య కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్రంలోని వివిధ స్టడీ సెంటర్‌ల సమన్వయకర్తల సమావేశంలో కరుణ ప్రసంగించారు. న్యాక్ ర్యాంకు సాధనలో దూరవిద్య కేంద్ర స్టడీ సెంటర్ పాత్ర కూడా ఎంతో ఉందని, ఆ మేరకు సహాయ సహకారాలు అందించాలన్నారు. దూరవిద్య కేంద్రం డైరెక్టర్ బి నాగరాజు సమావేశానికి అధ్యక్షత వహించారు. ఆగస్టులో దూరవిద్య పరీక్షలు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ డాక్టర్ సోమశేఖర్, అకడమిక్ కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

మంత్రివర్గం నిర్ణయాలపై హర్షం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి



రాష్ట్ర మంత్రి వర్గ సమావేశంలో ఎస్‌సి,ఎస్‌టి, బిసి, మైనార్టీలకు చెందిన అసైన్డు భూములక్రమ బద్ధీకరణతో పాటు పలు సంక్షేమ పథకాలను ఆమోదించినందుకు సిఎం జగన్‌కు వైసిపి నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక లాడ్జి సెంటర్‌లోఅంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఎన్నో ఏళ్లతరబడి పెండింగ్‌లో ఉన్న అంశాలను క్లియర్ చేశారని మాజీమంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ అన్నారు. ప్రధానంగా గ్రామాల్లో ఈ తరగతులకు స్మశాన వాటికల సమస్యను పరిష్కరించడం ముదావాహం అన్నారు. రాజదానిలో పేదలకు ఇళ్ల నిర్మాణానికి ప్రతిపక్షాలు ఎన్ని ఆటంకాలు కల్పించినా రాష్ట్ర ప్రభుత్వంఈనెల 24న నిర్మాణాలను ప్రారంభిస్తుందన్నారు. సిఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గుంటూరు నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్‌లు వనమా బాలవజ్ర బాబు,షేక్ సజీలా, జిల్లా గ్రంధాలయ సంస్థ అధ్యక్షులు దేవానంద్, ఫిరంగిపురం మండల్ ప్రజా పరిషత్ అధ్యక్షులు నర్గీస్, వైసిపి నాయకులు మాదారాధా, షేక్ నూరి ఫాతిమా, నిమ్మకాయల రాజనారాయణ తదితరలు పాల్గొన్నారు.

సైబర్ మోసాల్లో రూ.6.37 లక్షలు అందచేత

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇటీవల కాలంలో ఆన్‌లైన్ సైబర్ క్రైమ్ మోసాల్లో చిక్కుకొని ఎక్కువ మొత్తంలో డబ్బు పోగొట్టుకొన్న బాధితులకు జిల్లా ఎస్‌పి ఆరీఫ్ హాఫీజ్ ఊరట కల్పించారు. ఐటీ కోర్ విభాగానికి నోడల్ అధికారిగా వున్న అదనపు ఎస్‌పి సుప్రజ పర్యవేక్షణలో నల్లపాడు పోలీసు స్టేషన్ పరిధిలో గోరంట్ల కు చెందిన కొనిశెట్టి గంగారావు బ్యాంక్ అకౌంట్ నుంచి రూ.50వేలు, అరండల్ పేట చెందిన ఒక యువకుడు రూ.6 లక్షలు, పొన్నూరుకు చెందిన మరో యువకుడికి పార్ట్ టైమ్ జాబ్ అని నమ్మించి రూ.12 లక్షలు, చేబ్రోలుకు చెందిన ఒక యువకుడికి క్రెడిట్‌కార్డు కెవైసి అప్‌డేట్ అని నమ్మించి రూ.లక్ష మోసం చేసినట్టు ఫిర్యాదులు అందాయి. అలాగే కొంతమంది తమకు తెలిసిన వారికి ఫోన్‌పే, ద్వారా డబ్బులు పంపబోయి వేరే నంబర్లుకుపంపినవారికి మొత్తంగా గురువారం సంబంధిత బాధితులకు రూ. 6,37,201 ఇప్పించినట్టు ఎస్‌పి తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పి గారు మాట్లాడుతూ ప్రస్తుత సైబర్ ప్రపంచంలో ప్రజలు సైబర్ నేరాలకు గురి కాకుండా సైబర్ నేరాల పట్ల అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ప్రజలందరూ కూడా తమ వ్యక్తిగత సమాచారాన్ని గుర్తు తెలియని వారికి తెలుపకూడదని అందరూ తమ బయోమెట్రిక్‌ను లాక్ చేసుకోవాలన్నారు.

సిఆర్‌డిఎలో గృహ నిర్మాణాలపై కలెక్టర్ సమీక్ష

ప్రజాశక్తి-గుంటూరు

సిఆర్‌డిఎ పరిధిలోని లేఅవుట్లలో గృహ నిర్మాణాలు చేపట్టడానికి ముందుకు వచ్చిన ఏజెన్సీలు, సంబంధిత జిల్లా అధికారులు, స్పెషల్ అధికారులతో గురువారం జిల్లా కలెక్టర్ యం.వేణుగోపాల్‌రెడ్డి కలెక్టరేట్‌లో జెసి రాజకుమారి, తెనాలి సబ్‌కలెక్టరు గీతాంజలి శర్మతో కలసి సమావేశం నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ మొత్తము 25 లేఔట్‌లలో గుంటూరు, ఎన్‌టీఆర్ జిల్లాలలోని 47,017 మంది లబ్దిదారులకు గృహాలు మంజూరు అయ్యాయని తెలిపారు. ఈ నెల 24వ తేదీన ముఖ్యమంత్రిచే భూమి పూజతో గృహ నిర్మాణ పనులను ప్రారంభించటానికి, సంబంధిత లబ్దిదారులకు గృహాలు మంజూరు పత్రములను పంపిణీ చేయటానికి నిర్ణయించినట్లు చెప్పారు. కావున సంబంధిత అధికారులు, గృహ నిర్మాణ ఏజెన్సీలు అందరు అందుకు తగిన ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలన్నారు. సమావేశంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ యం. వెంకట శివరామి రెడ్డి, గహ నిర్మాణ శాఖ జిల్లా అధికారి టి. వేణుగోపాల్, డీఆర్డీఏ పీడీ హరిహరనాథ్, గుంటూరు ఆర్‌డిఓ ప్రభాకర రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు, పలువురు గృహ నిర్మాణ ఏజెన్సీల ప్రతినిధులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

215 పనులకు జిఎంసి స్థాయి సంఘం ఆమోదం

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగర సమగ్రాభివృద్ధి ధ్యేయంగా పాలకవర్గం కృషి చేస్తుందని స్థాయిసంఘ అధ్యక్షులు, నగర మేయర్ కావటి శివనాగ మనోహర్‌నాయుడు తెలిపారు. గురువారం స్థాయి సంఘం అధ్యక్షుల ఛాంబర్ (మేయర్ ఛాంబర్)లో నగర పాలక సంస్థ స్థాయి సంఘ సమావేశం నిర్వహించి పలు అభివృద్ధి పనులకు ఆమోదం తెలిపారు. సమావేశంలో నగరంలోని అన్ని డివిజన్లకు సంబంధించిన ప్రజా ప్రతినిధులు ప్రతిపాదించిన అంచనాలకు అధికారులు ప్రతిపాదనలు చేసిన 215 అభివృద్ధి పనులకు ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగరంలో పార్టీలకు అతీతంగా మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని చెప్పారు. ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారుల పరిశీలనలో గుర్తించిన ప్రజా సమస్యల పరిష్కారంలో భాగంగా డివిజన్ల వారీగా ప్రాధాన్యత క్రమంలో సి.సి రోడ్లు, డ్రైన్లు, కల్వర్టుల నిర్మాణాలకు ఆమోదం తెలిపామన్నారు. అలాగే విలీన గ్రామాల్లో నూతనంగా సి.సి డ్రైన్లు, రోడ్ల ఏర్పాటుకు ప్రత్యేక ఆమోదం తెలిపామన్నారు. సమావేశంలో స్థాయి సంఘ సభ్యులు నిమ్మల వెంకటరమణ, పడాల సుబ్బారెడ్డి, బొడ్డుపల్లి స్మితపద్మజ, షేక్.జుమ్మాబి, మల్లవరపు రమ్య, నగర అదనపు కమిషనర్ పెద్ది రోజా, డిప్యూటీ కమిషనర్లు బి.శ్రీనివాసరావు, టి.వెంకటకృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న మేయర్, ఇతర స్థాయి సంఘ సభ్యులు

రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ పోటీల్లో

స్వర్ణం సాధించిన ఎస్ఎస్ఎన్ విద్యార్థి మధు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

రాష్ట్ర స్థాయి స్విమింగ్ పోటీల్లో తమ కళాశాల విద్యార్థి వై మధుకిషోర్ స్వర్ణ పతకం సాధించాడని కళాశాల ప్రిన్సిపల్ సోము మల్లయ్య తెలిపారు. స్థానిక పల్నాడు రోడ్డులోని ఎస్.ఎస్.ఎన్ కళాశాలలో నిర్వహించిన8వ రాష్ట్ర స్థాయి అంతర్ జిల్లాల స్విమింగ్ పోటల్లో ఎస్ఎస్ఎన్ కళాశాల ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థి వై మధు కిషోర్ 50 మీటర్ల విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకం, 100 మీటర్లలో విభాగంలో తృతీయ స్థానంలో గెలు పొంది కాంస్య పతకం సాధించాడని తెలిపారు. ఈ సందర్భంగా ప్రతిభ చాటిన వై మధు కిషోర్ ను కళాశాల పాలకవర్గ అధ్యక్షులు కపిలవాయి విజయ్ కుమార్, సెక్రటరీ అండ్ కరెస్పాండెంట్ మాజీ మున్సిపల్ చైర్మన్ సుధీర్, వ్యాయామ అధ్యాపకులు వై. మధుసూదన్ రావు కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది తోటి విద్యార్థులు అభినందించారు. ప్రకాశం జిల్లా మొగిలిచర్లకు చెందిన వై.మధు కిషోర్ మొదటి నుండి స్విమ్మింగ్ పట్ల ఉత్సాహంగా ఉండేవాడిని తల్లిదండ్రులు చెప్పగా ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చినట్లు వ్యాయమ ఉపాధ్యాయుడు మధుసూదనరావు చెప్పారు.



మధుకిషోర్‌ను అభినందిస్తున్న కళాశాల అధ్యాపకులు తదితరులు

యువ న్యాయవాదులు తాడిపర్తిని ఆదర్శంగాతీసుకోవాలి

గుంటూరు బార్ అసోసియేషన్‌లో

తాడిపర్తి రామమోహన్‌కు ఘననివాళి

ప్రజాశక్తి - గుంటూరు లీగల్

గుంటూరు బార్ అసోసియేషన్‌లో తాడిపర్తి రామమోహనరావు చిత్రపట ఆవిష్కరణ మహోత్సవం గురువారం ఘనంగా జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డీవీఎస్ఎస్ సోమయాజులు చిత్రపటాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమానికి జిల్లా ప్రధాన న్యాయమూర్తి వై.వి.ఎస్.బి.జి. పార్థసారథి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జస్టిస్ సోమయాజులు మాట్లాడుతూ రామమోహనరావు తన వృత్తి నిర్వహణలో నీతి, నిజాయితి, నిబద్ధతో వ్యవహరించారని, ఆవు ఆయన్ను ఉన్నత స్థాయిలో నిలబెట్టాయని చెప్పారు. ఆయన్ను ఆదర్శంగా తీసుకుని యువ న్యాయవాదులూ తమ వృత్తిలో మంచి పట్టు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా జడ్జీలు, సబ్ జడ్జీలు, జూనియర్ సివిల్ జడ్జీలు, ప్రెసిడెంట్ కె.వి.కె.సురేష్, వైస్ ప్రెసిడెంట్ దాసరి ఉమామహేశ్వరరావు, జనరల్ సెక్రటరీ నాగ వంశీకష్ణ, ట్రెజరర్ విజయరాజ కుమార్, జీబీఏ మాజీ ప్రెసిడెంట్ శాంతకుమార్, సీనియర్ న్యాయవాది వైకే, ఏపీపీలు, గుంటూరు బార్ అసోసియేషన్ కార్యవర్గం, రామమోహన్‌రావు కుమారుడు తాడిపర్తి ఉమాకాంత్, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు సీనియర్ న్యాయవాదులు, గవర్నమెంట్ ప్లీడర్ పోకల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రామమోహన్‌రావుతో తమకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు.



తాడిపర్తి రామమోహనరావు చిత్రపట ఆవిష్కరణ సభలో మాట్లాడుతున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సోమయాజులు



నివాళులర్పిస్తున్న న్యాయవాదులు